Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 200 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 ఆగస్టు 2023 గురువారం పేజీలు : 4

## వచ్చే నెల 5న 6 రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆరు రాష్ట్రాల్లోని ఏడు నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి.

సెప్టెంబరు 5న ఎన్నికలు, 8న ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఊమెన్ చాందీ మరణం కారణంగా ఖాళీ ఏర్పడిన కేరళలోని పూత్తుపల్లి నియోజకవర్గానికి కూడా ఎన్నిక జరగనుంది. ఇది కాకుండా ఝార్ఖండ్‌లోని డుమ్రీ, త్రిపురలోని బొక్సానగర్, ధన్‌పూర్, పశ్చిమ బెంగాల్‌లోని ధూప్‌గురి, ఉత్తరాఖండ్‌లోని బాగేశ్వర్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘోసీ స్థానం ఎమ్మెల్యే దారా సింగ్ చౌహాన్ సమాజ్‌వాదీకి రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో అక్కడ ఉప ఎన్నిక అవసరమయింది.



## యువత ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబం

# ఐటీ హబ్

### ఐటీ టవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్

నిజామాబాద్ : ఐటీ హబ్ అంటే కేవలం బిల్డింగ్ మాత్రమే కాదు.. స్థానిక యువత ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిబింబం అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. భవిష్యత్‌లో వారు హైదరాబాద్, అమెరికా వెళ్లాలంటే ఒక మెట్టు ఇక్కడ ఎక్కేందుకు ఐటీ హబ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐటీ టవర్, న్యాక్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకునేది అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అని కేటీఆర్ తెలిపారు. రూ. 50 కోట్లతో ఐటీ హబ్ నిర్మించాం. ఇక్కడ డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా చదివిన 1400 మంది పిల్లలకు ఉద్యోగాలు కల్పించాం. భవిష్యత్‌లో ఉద్యోగాలు కావాలన్నా.. మీరే ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నా నైపుణ్యం పెంచుకోవాలి. రాజకీయాలు ఎప్పుడూ ఉంటాయి. మన భవిష్యత్ భద్రంగా, తల్లిదండ్రులు గర్వపడేలా ఉండాలంటే.. ఇలాంటి సదుపాయాలను అందిపుచ్చుకోవాలని కేటీఆర్ సూచించారు. ఐటీ హబ్ పక్కనే ప్రత్యేకంగా రూ. 11 కోట్లతో న్యాక్ బిల్డింగ్‌తో పాటు హాస్టల్ వసతిని ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. దీన్ని కూడా డిప్లొమా, ఐటీఐ, టెన్త్ విద్యార్థులు వినియోగించుకోవాలి. ఈ సంస్థలన్నీ మీ కోసమే. రూ. 7 కోట్లతో మున్సిపల్ కార్యాలయాన్ని అధునాతనంగా నిర్మించారు. బహుషా తెలంగాణలోనే బెస్ట్ మున్సిపాలిటీ కార్యాలయం ఇక్కడే ఉందని చెప్పొచ్చు. ట్యాంక్ బండ్ మాదిరిగానే రఘునాథ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అద్భుతంగా తీర్చిదిద్దారు. పాలిటెక్నిక్ కాలేజీలో కొత్త బ్లాక్‌ను ప్రారంభించుకున్నాం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దుబ్బ ప్రాంతంలో మూడు వైకుంఠధామాలు 15 కోట్ల 50 లక్షలతో అద్భుతంగా నిర్మించారు. హైదరాబాద్‌లోని మహాప్రస్థానం కంటే ఈ వైకుంఠధామాలే బాగున్నాయని కేటీఆర్ తెలిపారు.

**రేవంత్ రెడ్డి తెలంగాణవాది కాదు.. తెలంగాణకు పట్టిన వ్యాధి :** గత యాభై ఏండ్లలో తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు కూడా మోసం చేసేందుకు యత్నిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి నికార్సయిన తెలంగాణవాది కాదు.. తెలంగాణకు పట్టిన వ్యాధి. ఉద్యమకారులపైకి రైఫిల్ తీసుకెళ్లిన రైఫిల్ రెడ్డంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

నిజామాబాద్ జిల్లాలో ఐటీ టవర్, న్యాక్ భవనం ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. కాంగ్రెసోళ్లు కూడా కేసీఆర్ మీద ఎగబడి ఎగబడి మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఒక్కసారి అవకాశం ఇవ్వండని కాంగ్రెసోళ్లు అడుగుతున్నారు. వీళ్లకు ఒక్కసారి కాదు.. పది సార్లు అవకాశం ఇవ్వలేదా.? 50 ఏండ్ల పాటు ఈ కాంగ్రెస్ పార్టీ మనల్ని సతాయించలేదా..? 50 ఏండ్ల పాటు అధికారంలో ఉండి తాగునీరు, సాగునీరు, కరెంట్ చక్కగా ఇవ్వలేదు. ఎరువులు, విత్తనాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టారు. మన పట్టణాలకు నిధులు ఇవ్వకుండా సావగొట్టింది కాంగ్రెస్ పార్టీ కాదా..? ఇవాళ వాళ్లే వచ్చి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు.. ఆలోచించండి. కేసీఆర్ ఈ రోడ్డు ఇట్ల ఎందుకుంది.. ఆ మోరి అట్ల ఎందుకుంది అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. యాభై ఏండ్లు పరిపాలించినోడో, ఏ పని చేయడానికి చేతకానోడో.. ఇవాళ మన ముందుకొచ్చి కేసీఆర్‌ను తిడుతుంటే పడుదామా? తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులపైకి రైఫిల్ తీసుకెళ్లిన రైఫిల్ రెడ్డి.. నికార్సయిన తెలంగాణ వాది అటా..? రేవంత్ రెడ్డి నీవు తెలంగాణవాది కాదు.. నువ్వు తెలంగాణకు పట్టిన వ్యాధి. తెలంగాణకు పట్టిన జబ్బు, దరిద్రం కాంగ్రెస్ పార్టీ. దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీ మాటలను నమ్మి ఆగం కావొద్దు అని కేటీఆర్ ప్రజలకు సూచించారు.

**బీజేపోడు వస్తే గుండుకొట్టి.. డిపాజిట్లు గల్లంతు చేయాలి..** మోదీ అధికారంలోకి వచ్చాక మతకల్లోలాలు పెరిగాయని కేటీఆర్ తెలిపారు. సిలిండర్ ధరలు పెరిగాయి. ఉద్యోగాల భర్తీ జరగలేదు. బీజేపోడు ఎవడైనా వస్తే గుండుకొట్టి.. డిపాజిట్లు గల్లంతు చేసి మోదీకి బుద్ధి చెప్పాలి. సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా కూడా పెట్రోల్ ధరలు మాత్రం తగ్గడం లేదు. రూ. 70 ఉన్న పెట్రోల్‌ను రూ. 110 చేశాడు. పెట్రోల్ ధరలు పెంచడంతో నిత్యావసరాల ధరలు కూడా పెరిగాయి. పిరపమైన ప్రధానమంత్రి మోదీకి మీ ఓటుతోనే సమాధానం చెప్పాలి. బీజేపీ పార్టీని గల్లీలో గల్లా పట్టి నిలదీయాలి. హిందూ, ముస్లిం అని పంచాయతీలు పెట్టడం తప్ప నీవు ఏం చేసినవ్ ఈ 9 ఏండ్లలో. ఒక్క మంచి పనైనా నిజామాబాద్‌కు చేశావా అని ఎంపీని నిలదీయాలి. చైతన్యవంతమైన నిజామాబాద్ ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలని కేటీఆర్ కోరారు.

## దేశంలో తెలంగాణ భాగమే కదా.. ఎందుకీ వివక్ష ?

### కేంద్రంపై ఎంపీ నామా నాగేశ్వర్ రావు ఫైర్



న్యూఢిల్లీ : కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి సాధిస్తోంది అని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్ రావు స్పష్టం చేశారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై రెండో రోజు చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ నామా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. విభజన చట్టం హామీలను నెరవేర్చాలని 9 ఏండ్లుగా కేంద్రాన్ని కోరుతున్నాం. కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని ఎన్నోసార్లు అడిగాం. కోచ్ ఫ్యాక్టరీలను గుజరాత్, మహారాష్ట్రకు ఇచ్చి మాకు రిపేర్ ఫ్యాక్టరీ ఇచ్చారు. తెలంగాణలో ట్రైబల్ యూనివర్సిటీ ఇవ్వాలని అడిగాం. నవోదయ విద్యాలయాల కోసం ఎన్నో సార్లు లేఖలు రాశాం. అయినప్పటికీ మెడికల్ కాలేజీలు, నవోదయ విద్యాలయాలు ఇవ్వట్లేదు. తెలంగాణ పట్ల మోదీ సర్కార్ వివక్ష చూపిస్తోంది. చిన్న రాష్ట్రాల పట్ల మోదీ సర్కార్ తీరు సరిగా లేదు. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం. తెలంగాణ కూడా దేశంలో భాగమే కదా? అని ఎంపీ నామా ప్రశ్నించారు.

**తెలంగాణ పథకాలను అనుసరిస్తున్న కేంద్రం..** తెలంగాణ పథకాలను కేంద్రం అనుసరిస్తోంది నాగేశ్వర్ రావు తెలిపారు. ఇంటింటికి నల్లా ద్వారా మంచినీరు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. ఇతర రాష్ట్రాల్లో ఇంటింటికి మంచినీరు ఇస్తోందా..? హర్ ఘర్ జల్ పథకం కింద అన్ని రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నారు. మిషన్ భగీరథకు రూ. 24 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసినా ఒక్క రూపాయి ఇవ్వలేదు. సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. ధాన్యం దిగుబడిలో పంజాబ్‌ను తెలంగాణ అధిగమించింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను కేంద్రం విపరీతంగా పెంచింది. యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీఐఆర్ ప్రాజెక్టును మోదీ సర్కార్ రద్దు చేసింది అని ఎంపీ మండిపడ్డారు.

## బీసీ కుల వృత్తిదారులకు చేయూత అందించేందుకే లక్ష ఆర్థిక సాయం : మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట : కుల వృత్తులను కాపాడి వారికి ఆర్థికంగా చేయూత అందించేందుకు బీసీ కుల వృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయ పథకం అమలు చేస్తున్నాం. బ్యాంకుల ద్వారా ష్యూరిటీ, గ్యారెంటీ లేకుండా సీఎం కేసీఆర్ చొరవతో నేరుగా లబ్ధిదారులకు ఒక లక్ష రూపాయల చెక్కుల పంపిణీ చేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. వెనుకబడిన తరగతులు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కుల వృత్తులను ప్రోత్సహించాటినికి లక్ష రూపాయల ఆర్థిక సాయం- సిద్దిపేట నియోజకవర్గం స్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నారాయణరావుపేట, చిన్నకోడూరు, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాల్లోని 200 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ బీసీ కుల వృత్తిదారులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఫ్రీ కరెంటు, గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ, నేతన్నలకు 50 శాతం సబ్సిడీతో నూలు, వారు నేసిన వస్త్రాలను ప్రభుత్వ కొనుగోలు, చేనేత మిత్ర వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. మత్స్యకారుల కోసం నీటి వనరులలో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేశామని తెలిపారు.

600 కోట్ల రూపాయలు వ్యయం చేసి మత్స్యకారులకు లూనాలు, మోపెడ్ల పంపిణీ, గీత కార్మికులకు చెట్ల పన్ను, పాత బకాయిల రద్దు, సొసైటీల పునరుద్ధరణ..ఎక్కడ లేని విధంగా సిద్దిపేటలో మోడల్ దోబీ ఘాట్ నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. కుమ్మరుల అభివృద్ధి కోసం సిద్దిపేటలో 2 కోట్ల 20 లక్షల రూపాయలతో రాష్ట్రంలోనే తొలిసారిగా ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణం కోసం మట్టి కుండలు, మట్టి వంట పాత్రలు, మట్టి గ్లాసులు తదితర మట్టి పాత్రల తయారీ కోసం మోడల్ ప్రాజెక్ట్ చేపట్టామని గుర్తు చేశారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో మొత్తం 330 రెసిడెన్షియల్ స్కూల్స్ మాత్రమే ఉండగా ప్రస్తుతం 1012 ఏర్పాటు చేసుకున్నాము.

జిల్లాలో ఇప్పటికీ ఎస్సీ డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీ ఉంది. జిల్లాలో బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారని మంత్రి వివరించారు. త్వరలోనే బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను సిద్దిపేటలో ఏర్పాటు చేసుకోబోతున్నాం. రూపాయి ఖర్చు లేకుండా డిగ్రీ వరకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను పేద విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు పాల సాయిరాం, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో 'శాంతి'కి చోటు లేకుండా పోయింది




### లోక్‌సభలో మోదీ సర్కార్‌పై నిప్పులుచెరిగిన రాహుల్

దిల్లీ: మణిపూర్ అంశంపై లోక్‌సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. భాజపాపై విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీనే లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వంపై విపక్ష కూటమి 'ఇండియా' లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రెండోరోజు చర్చ జరిగింది. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగా.. మధ్యాహ్నం 12 గంటలకు అవిశ్వాసంపై చర్చను ప్రారంభించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చర్చను ప్రారంభించి ప్రసంగించారు. తన లోక్ సభ సభ్యత్వం పునరుద్ధరించిన తర్వాత ఆయన తొలిసారిగా మాట్లాడారు. భారత్ దేశాన్ని మణిపూర్‌లో హత్య చేశారని అధికార పక్షంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. బుధవారం లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన ఆవేశపూరితంగా ప్రసంగించారు.

**నాలో అహంకారం మాయమైంది..** "నేను సముద్ర తీరం నుంచి మంచు పర్వతాల వరకూ నడిచాను. చాలా మంది నన్ను పాదయాత్రపై ప్రశ్నించారు. తొలుత వారికి ఏమి చెప్పాలో నాకు తెలియలేదు. కానీ, యాత్ర మొదలైన కొన్నాళ్లలోనే విషయం నాకు అర్థం కావడం మొదలైంది. దేని కోసం నేను మరణానికి కూడా సిద్ధమో.. దేని కోసం జైళ్లకు వెళ్లడానికి సిద్ధమో.. అది అర్థం కావడం మొదలైంది. కొన్నేళ్ల నుంచి నేను నిత్యం దాదాపు 10 కిలోమీటర్ల పరిగెత్తేవాడిని. అలాంటిది రోజుకు పాతిక కిలోమీటర్లు నడవడం ఏముంది అనుకొన్నా. అప్పట్లో నాలో అహంకారం ఉంది. కానీ, ఆ అహంకారాన్ని భారత్ ఒక్క క్షణంలో మాయం చేస్తుంది. రెండు మూడు రోజుల్లోనే నాకు ఒళ్లు నొప్పులు మొదలయ్యాయి. నాలో అహంకారం మాయమైంది. ఈ యాత్రలో ప్రజలు నాకు అండగా నిలిచారు. జనసందోహాన్ని చూసి ఒక్కోసారి మాట్లాడలేకపోయా. ప్రతి రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 8 గంటల వరకు వివిధ వర్గాలు చెప్పింది విన్నాను"

**ఈ దేశం ఓ గొంతుక..** "నా వద్దకు ఓ రైతు వచ్చాడు.. అతడికి పంటల బీమా దక్కిందా అని అడిగాను. లభించలేదని చెప్పాడు. ఆ క్షణంలో రైతు మనసులోని బాధను నేను అనుభవించాను. అతడి ఆకలి బాధ నాకు తెలిసొచ్చింది. ఆ తర్వాత యాత్ర తీరు మారిపోయింది. నాటి నుంచి చుట్టుపక్కల ప్రజల నినాదాలు నాకు వినిపించేవికాదు. నాకు కష్టాలు చెప్పుకొనేవారి ఆవేదన మాత్రమే వినిపించేది. ఈ దేశాన్ని భూమి, బంగారం, భాషల పేరుతో రకరకాలుగా పిలుస్తుంటారు. కానీ, ఈ దేశం ఓ గొంతుక. దానిని వినాలంటే మన మనసులోని అహంకారాన్ని, ద్వేషాన్ని త్యజించాలి. అప్పుడే హిందుస్థాన్ గొంతు వినిపిస్తుంది"

**మణిపూర్‌ను రెండు ముక్కలు చేశారు..** "ఇది అవిశ్వాస తీర్మానంలో ఎందుకు చెబుతున్నానంటే.. కొన్ని రోజుల క్రితమే నేను మణిపూర్ వెళ్లాను. కానీ, మన ప్రధాని అక్కడికి వెళ్లలేదు. ఆయన దృష్టిలో మణిపుర్ భారత్‌లో లేదు. మణిపుర్ ఇక ఏమాత్రం మిగిలిలేదు. ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా విడగొట్టారు. అక్కడి పునరావాస శిబిరాల్లో మహిళలు, పిల్లలతో మాట్లాడాను. మీకు ఏమి జరిగింది..? అని ఓ మహిళను ప్రశ్నించా.. దీనికి ఆమె స్పందిస్తూ.. 'నా ఏకైక బిడ్డను కళ్లెదుటే కాల్చిచంపారు. ఆ రోజు రాత్రి మొత్తం నా బిడ్డ శవం వద్దే పడి ఉన్నాను. ఆ తర్వాత నాకు భయం వేసింది. చివరికి నా సర్వస్వం వదిలి కట్టుబట్టలతో వెళ్లిపోయాను' అని చెప్పింది. ఒక ఫొటో మాత్రం చూపింది" "మరో క్యాంపులో ఓ సోదరిని ప్రశ్నించగా.. ఆమెకు జరిగింది గుర్తుకు వచ్చి వణికిపోవడం మొదలుపెట్టింది. ఆ తర్వాత స్పృహ కోల్పోయింది. మీకు రెండు ఉదాహరణలు మాత్రమే చెప్పాను. స్పీకర్ సర్.. వీళ్లు (పాలకులు) మణిపుర్‌లో భారత్‌ను హత్య చేశారు. దేశం ప్రాణం తీశారు. నేను ప్రసంగం మొదట్లో చెప్పినట్లు భారత్ ఓ గొంతు.. అది ప్రజల హృదయ స్పందన. దానిని చంపేశారు. అంటే భారత మాతను మీరు మణిపుర్‌లో హత్య చేశారు. మీరు దేశ ద్రోహులు, దేశ ప్రేమికులు కాదు. అందుకే మీ ప్రధాని మణిపుర్‌కు వెళ్లడంలేదు" అని భాజపాపై రాహుల్ తీవ్రంగా విరుచుకుపడ్డారు.


**మీరు కిరోసిన్ చల్లుతున్నారు..** "నా తల్లి ఒకరు ఇక్కడ ఉన్నారు.. మరో తల్లిని మణిపుర్‌లో చంపారు. భారత సైన్యం ఒక్కరోజులోనే మణిపుర్‌లో శాంతి తీసుకురాగలదు. కానీ, అలా చేయడం లేదు. ప్రధాని దేశ హృదయ స్పందన వినడంలేదు. ఆయన ఇద్దరి మాటలు మాత్రమే వింటారు. అదానీ కోసం మోదీ ఏం చేశారో చూడండి. రావణాసురుడు మేఘనాథుడు, కుంభకర్ణుడి మాటే వింటాడు. అలానే మోదీ.. అదానీ, అమిత్‌షా మాటలే వింటారు. లంకను రావణుడి అహంకారమే కాల్చింది. దేశంలో మీరు కిరోసిన్ చల్లుతున్నారు. మణిపుర్‌లో చల్లారు. ఇప్పుడు హరియాణాలో చల్లుతున్నారు" అని తన ప్రసంగాన్ని రాహుల్ ముగించారు.

# సంపాదకీయం

## మోడిలో భయం మొదలైందా ?

ఇండియా కూటమి ఏర్పడిన దగ్గరి నుండి నరేంద్రమోడీ పదేపదే కూటమి పై మాటల తో దాడులుచేస్తున్నారు. ఇండియా కూటమిని అవహేళన చేస్తు ఎందుకు మాట్లాడుతున్నారో అర్థంకావటంలేదు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల పై ఎన్డీయే మిత్రపక్షాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇండియా కూటమిని ఉద్దేశించి ఇండియా కాదు ఘమండియే అని అభివర్ణించారు. ఇండియా నేతలను అహంబావులుగా మోడీ వర్ణించారు. దేశాన్ని దోచుకుతినటానికే ప్రతిపక్షాలు ఇండియా కూటమిగా పేరు పెట్టుకున్నట్లు ఎద్దేవా చేశారు. కూటమి పేరులో ఇండియా అని ఉండటాన్ని మోడీ తట్టుకోలేకపోతున్నట్లు అర్థమవుతోంది. కూటమి పేరులో ఇండియా అని ఉంటే మోడీకి వచ్చిన అభ్యంతరం ఏమిటో తెలీటంలేదు. కూటమి పేరులో ఇండియా అని ఉండకూడదని అనుకుంటే మరి బీజేపీ పూర్తి పేరు భారతీయ జనతా పార్టీయే కదా. అంటే బీజేపీ లో కూడా భారతీయ అని ఉండచ్చా ? హిందీ లో భారతీయ అన్న పదానికి ఇంగ్లీషులో ఇండియానే కదా. దేశం పేరును హిందీ లో బీజేపీ వాళ్ళు పెట్టుకుంటే ఇంగ్లీషులో ఇండియా అని వచ్చేట్లుగా కొత్తగా ఏర్పడిన ప్రతిపక్షాల కూటమి పెట్టుకున్నదంతే. ఇంతోటి దానికి మోడీ ఎందుకు పదేపదే ఎద్దేవా చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఒకవిషయమైతే అర్థమవుతోంది. అదేమిటంటే ఇండియా కూటమి అంటే మోడీలో టెన్షన్ మొదలైందని. ఎన్డీయేకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల్లోని ఇన్ని పార్టీలు ఏకతాటిపైకి వస్తాయని మోడీ ఊహించుండరు. కొత్త కూటమిగా ప్రతిపక్షాలు ఏర్పడటమే కాకుండా ఇపుడు జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో సమిష్టిగా కేంద్ర ప్రభుత్వం పై పోరాటం చేస్తున్నాయి. ఈ పోరాటం లో భాగంగానే మణిపూర్ అల్లర్లపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఇక ఆచితూచి మాట్లాడటంలో సుష్మాస్వరాజ్ నే అందరు ఆదర్శంగా తీసుకోవాలని మోడీ భాగస్వామ్యపార్టీల నేతలకు చెప్పటమే విచిత్రంగా ఉంది. అసలు మోడీయే ప్రతిపక్షాల పై నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటారు. పార్లమెంటులో ప్రతిపక్షాల కు సమాధానం చెప్పాల్సిన మోడీ బయటెక్కడో మాట్లాడుతుంటారు. మాట్లాడేది కూడా అడ్డ అదుపు లేకుండా రెచ్చగొడుతు మాట్లాడుతారు. మొత్తానికి మోడీ భయపడేట్లుగా ఇండియా కూటమి గట్టిగానే పోరాడుతున్నట్లు అనుకోవాలి. తానెంతో బలమైన నేతనని, ప్రపంచంలోని అత్యంత బలమైన నేతల్లో తాను కూడా ఒకడినని అనుకునే మోడీ ప్రతిపక్ష ఇండియా కూటమి గురించి పదేపదే మాట్లాడుతున్నారంటేనే అర్థమైపోతోంది ఎంతగా భయపడుతున్నారో.

# పరీక్ష... పరిరక్షణ!



సంగారెడ్డి : క్షయ.. ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపిస్తుంది. 2025లోగా క్షయ రహిత భారత్ నిర్మాణానికి కేంద్రం నడుంబిగించింది. ముఖ్యంగా చిన్నారులపై దృష్టిసారించాలని సూచించింది. ఈ మేరకు సర్వే చేపట్టింది. నిర్ధారణ కాగానే మందులు, నగదు సాయం అందజేస్తున్నారు.

సర్వే చేయిస్తూ..కేంద్రం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగింది. ఇంటింటి సర్వే చేపట్టింది. సంగారెడ్డి జిల్లా పరిధి పటాన్‌చెరులోని 111, 115 డివిజన్లు, సదాశివపేట, జోగిపేట, దిగ్వాల్, హెూతి- బి, మాడ్గి, చాప్టా-కె లలో సదరు సర్వే కొనసాగు తోంది. ఆయా ప్రాంతాల్లో ఈనెల 15 వరకు రోజుకు 50 నుంచి 100 మంది వరకు పరీక్షిస్తున్నారు. మెదక్, వికారాబాద్ జిల్లాల్లోనూ నిర్దేశించిన ప్రాంతాల్లో పరీక్షలు చేస్తున్నారు.

నగదు సాయం..సదరు వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కాగానే మందులు పంపిణీ చేస్తున్నారు. దీనికితోడు ఆరు నెలల పాటు పండ్లు, ఇతర ఖర్చులకు రూ.3500 ఇస్తుండటం గమనార్హం. నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. చిన్నారులకూ వర్తింపజేస్తున్నారు. వారికి ఖాతాలు లేకపోతే తల్లిదండ్రుల ఖాతాల్లో జమచేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి.. సంగారెడ్డి జిల్లాలో గతేడాది 2,430 మందికి క్షయ ఉన్నట్లు నిర్ధారణ అయింది. వీరిలో బాలలు 18 మంది ఉన్నారు. సంగారెడ్డిలో అత్యధికంగా 526 మంది అత్యధికంగా ఉన్నారు. పటాన్‌చెరు-506, నారాయణఖేడ్-410, జహీరాబాద్- 365, జోగిపేట -314, మిర్జాపూర్- 309 మంది బాధితులుగా గుర్తించారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారితో వ్యాపిస్తోందని గుర్తించారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు చేర్యాల, నంగునూరు, బెజ్జంకి, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రులు, ములుగులోని వైద్య కళాశాలలో నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. గతేడాది 2117 మంది క్షయ బారినపడ్డారు. వీరిలో బాలలు 14 మంది ఉన్నారు.

మెదక్ జిల్లాలో గతేడాది ఎనిమిది మంది చిన్నారులకు క్షయ సోకింది. వారికి ఆరునెలలు సరిపడా మందులు అందజేశారు. దీంతో ఆరుగురికి తగ్గుముఖం పట్టింది.

వికారాబాద్ జిల్లాలో మొత్తం 1700 మంది బాధితులు ఉన్నారు. వీరిలో 270 మంది బాలలు ఉన్నారు. బాలల బరువును బట్టి వారికి రెండు రకాల మందులు పంపిణీ చేస్తున్నారు.

అవగాహన.. చైతన్యం..

నమూనాలను విశ్లేషించి 24 గంటల్లో ఫలితాన్ని వెల్లడిస్తున్నారు. రోగం ఉన్నట్లు నిర్ధారణ కాగానే వైద్య సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన మందులు ఇస్తున్నారు. దీనికితోడు నిరంతరం అనుశీలన చేస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత కుటుంబీకులను సైతం పరీక్షించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. పరిశ్రమలు అత్యధికంగా ఉన్న పటాన్‌చెరు, సదాశివపేట, చేగుంట, మనోహరాబాద్ తదితర చోట్ల స్వచ్ఛంద సంస్థల ద్వారా కార్మికులకు క్షయపై చైతన్యం తీసుకొస్తున్నారు.

చిన్నారుల్లో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో బాధిత చిన్నారులు పెద్ద సంఖ్యలో లేకపోవడం ఊరటనిచ్చేదే. కానీ చాపకింద నీరులా వ్యాపిస్తుండటంతో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించడం ఎంతో అవసరం. ఈ దిశగా వైద్యారోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఏ మాత్రం అనుమానం ఉన్నా నిర్ధారణ చేయించుకోవడం ఎంతో మంచిది. వికారాబాద్ జిల్లాలో మాత్రం సంఖ్య భారీగానే ఉంది.

ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ..- రాజేశ్వరి, క్షయ నివారణ అధికారిణి, సంగారెడ్డి

బాధితులకు అవగాహన కల్పిస్తున్నాం. వారికి అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నాం. ఇళ్లల్లో ఎవరికైనా సోకిందా అని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. చిన్నారులపై ప్రత్యేక దృష్టిసారించాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# దండిగా నిధులు.. మారేను బడుల రూపురేఖలు!




సిద్దిపేట : సర్కారు బడుల రూపురేఖలు మార్చి.. నాణ్యమైన గుణాత్మక విద్య అందించేందుకు చర్యలు మొదలయ్యాయి. పీఎంశ్రీ (ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం రూపంలో దండిగా నిధులు సమకూరనున్నాయి. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో కొనసాగే వివిధ రకాల పాఠశాలలకు వరంగా మారనుంది. పథకం కింద ఎంపికైన ఒక్కో విద్యాలయానికి ఐదేళ్ల వ్యవధిలో రూ.2 కోట్ల మేర అందనున్నాయి. ఏడాదిలో నాలుగు మార్లు కొత్త పాఠశాలలు ఎంపిక చేయనున్నారు.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు - మన బడి పథకం కింద పెద్దఎత్తున అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోంది. ఇదే తరుణంలో కేంద్ర ప్రభుత్వం 'పీఎంశ్రీ' ద్వారా అభివృద్ధి చేయనుంది. ఏడాదికి రూ.40 లక్షల చొప్పున.. ఐదేళ్ల పాటు మొత్తంగా కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించనుంది. మౌలిక వసతుల కల్పన, విద్యాభివృద్ధికి వెచ్చించనున్నారు. ఇదే క్రమంలో గుణాత్మక విద్య అమలు చేసేందుకు నిధులు దోహదం చేయనున్నాయి. ల్యాబ్‌లు, స్మార్ట్ తరగతులు, గ్రంథాలయాలు, క్రీడా వసతులు సహా మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

తొలుత ఇలా..పలు దశల్లో వడబోసి.. మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక చేయనున్నారు. 2021-22 యూడైస్ ఆధారంగా అత్యధికంగా విద్యార్థులు నమోదు కలిగిన జిల్లాలోని 274 ప్రభుత్వ పాఠశాలలను పీఎంశ్రీ వెబ్‌పోర్టల్ ప్రకటించింది. అందులో 67 అంశాల ప్రాతిపదికన దరఖాస్తులు చేయాల్సిందిగా నిర్వాహకులకు సూచించింది. ఈ మేరకు మండలాల పరిధిలో కొనసాగే పాఠశాలలకు 60 శాతం, పట్టణాల పరిధిలో 70 శాతం మార్కులను నిర్దేశించింది. ఈమేరకు జిల్లాలో 162 అర్హత సాధించాయి. ఇటీవల మండల విద్యాధికారి, మండల నోడల్ అధికారి, ఇద్దరు గెజిటెడ్ హెచ్‌ఎంలు, ఒక స్కూల్ అసిస్టెంట్‌తో మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశారు. 24 మండలాలకు చెందిన కమిటీలకు రెండు రోజుల పాటు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో శిక్షణ అందించారు.

నేటి నుంచి తనిఖీలు

జిల్లాలో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు ఆయా పాఠశాలలను తనిఖీ చేయనున్నారు. 67 అంశాలను పరిగణనలోకి తీసుకొని జాబితాను జిల్లా విద్యాధికారి కార్యాలయంలో 12వ తేదీన సమర్పిస్తారు. జిల్లా పాలనాధికారి ఆధ్వర్యంలో మరోసారి పరిశీలన చేయనున్నారు. ఈనెల 15 లోపు జిల్లాస్థాయిలో ప్రక్రియ పూర్తి కానుంది. 16 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర బృందం మరోసారి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి తుది జాబితాకు ఎంపిక చేయనుంది. ప్రతి మూడు నెలలకోసారి పీఎంశ్రీ వెబ్‌పోర్టల్ అందుబాటులోకి రానుంది. విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు అవకాశం కల్పించనున్నారు.

చక్కటి అవకాశం..తొలుత మండలానికి రెండు చొప్పున పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. అందులో ప్రాథమిక, ఉన్నత స్థాయి ఒకటి చొప్పున ఉంటుంది. అన్ని రకాల యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలలకు ఇదో చక్కటి అవకాశం. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచనలకు అనుగుణంగా వివిధ దశల్లో పరిశీలన కొనసాగుతుంది. వై.నర్సింలు, జిల్లా స్టాటిస్టికల్ అధికారి (డీఈవో కార్యాలయం)

# పేదలకు ఆహార భరోసా

సంగారెడ్డి : నిత్యావసర సరకులు తక్కువ ధరలకే పేదలకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ ఉద్దేశంతో ప్రజాపంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్‌కార్డుదారులకు ప్రతినెలా ఇస్తున్నారు. కరోనా కారణంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. డిసెంబరుతో ఈ పథకం ముగియగా, మరో ఏడాది పాటు కొనసాగింపునకు నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఈనెల 5వ తేదీ నుంచి బియ్యం పంపిణీ ప్రారంభం కానుంది. జిల్లాలో 845 ప్రజాపంపిణీ దుకాణాలు ఉన్నాయి. ప్రతినెలా 1-15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈనెల కోటా కేటాయింపు ఆలస్యం కావడంతో గడువు పొడిగించనున్నారు. రేషన్ దుకాణాల పరిధిలో 3,78,279 రేషన్‌కార్డులు ఉండగా వీటిలో 12,39,764 మంది సభ్యులుగా ఉన్నారు. బియ్యం పక్కదారి పట్టకూడదని ఓటీపీ విధానం స్థానంలో బయోమెట్రిక్‌ను పునరుద్ధరించారు. కార్డులో సభ్యుల సంఖ్య ఆధారంగా డిసెంబరు వరకు 10 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందించారు. ఈనెల 5కిలోల చొప్పున మాత్రమే పంపిణీ చేయనున్నారు. జిల్లాలకు 6వేల మెట్రిక్ టన్నుల కోటాను కేటాయించారు.

నిత్యావసరాల పునరుద్ధరణ ఎప్పుడో?

గతంలో ప్రజా పంపిణీ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు నూనె,



పప్పు, గోధుమపిండి, చింతపండు, ఉప్పు తదితర సరకులను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరకుల ధరలు రోజురోజుకు ఆకాశన్నంటుతున్నాయి. నిరుపేదలు కొనుగోలుచేసే పరిస్థితి లేకుండా పోయింది. వీటిని పంపిణీ పునరుద్ధరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..వనజాత, జిల్లా పౌరసరఫరాల అధికారిణిప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతాం. ఈనెల 5కిలలో చొప్పున బియ్యం పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఉచితంగా ఇవ్వడంతో పేదలకు మేలు చేకూరుతోంది. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# ముందుకు సాగక.. అందుబాటులోకి రాక..

మెదక్ : పట్టణాల్లో నివసిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ దిశగా పురపాలికల్లో కూరగాయలు, మాంసం, ఇతరత్రా ఒకే చోట విక్రయించేలా సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గజ్వేల్, సిరిసిల్ల మార్కెట్ల తరహాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో సముదాయాలు నిర్మించాలని నిర్ణయించారు. తూప్రాన్‌లో మాత్రమే అందుబాటులోకి రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయా చోట్ల నెలకొన్న పరిస్థితిపై కథనం.

నిధులు వెనక్కి..

నర్సాపూర్‌లో సదరు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నర్సాపూర్ పురపాలికకు కేటాయించిన రూ.25 కోట్లలో నుంచి రూ.4 కోట్లు సైతం దీనికి కేటాయించారు. పాత తహసీల్దారు కార్యాలయ స్థలంలో పనులు మొదలుపెట్టారు. పునాదులు తీసి, పిల్లర్లు నిర్మించి వదిలేశారు. రెండు నెలల కిందట నిలిచిపోయాయి. ప్రస్తుతం సమీకృత మార్కెట్ నిర్మాణానికి కేటాయించిన రూ.6 కోట్లలో నుంచి రూ.3 కోట్లు పురపాలికకు మళ్లించాలని



ఇటీవల జరిగిన పుర సమావేశంలో నిర్ణయించారు. దీంతో రూ.3 కోట్లే మిగిలే అవకాశం ఉంది.

ఎట్టకేలకు పడిన అడుగు..

జిల్లా కేంద్రంలో సమీకృత మార్కెట్‌కు రూ.4.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. స్థానికులు అభ్యంతరం తెలిపి హైకోర్టును ఆశ్రయించారు. స్టే రావడంతో నిర్మాణం నిలిచిపోయింది. తాజాగా పట్టణంలోని నీటిపారుదల శాఖ కార్యాలయ ఆవరణలోని రెండున్నర ఎకరాల స్థలాన్ని కేటాయించారు. దీంతో గుత్తేదారు పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం కూరగాయల విక్రయాలు పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో కొనసాగుతున్నాయి. ఎండకు ఎండి, వానకు తడుస్తూ చలికి వణుకుతూ అమ్ముతున్నారు. ఇరుకైన స్థలంలో అమ్మకాలు సాగిస్తుండగా తరచూ ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి.

పిల్లర్ల స్థాయిలో..రామాయంపేట మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పిల్లర్ల దశలో ఉంది. గతంలో రూ.50 లక్షలతో రైతుబజారు నిర్మాణం చేపట్టారు. కొద్ది రోజులు విక్రయాలు సాగించగా, ప్రస్తుతం నిలిచిపోయాయి. అక్కడి నుంచి చర్చి మైదానంలో తాత్కాలికంగా టార్పాలిన్ కవర్లతో కప్పు ఏర్పాటు చేసుకొని చిరువ్యాపారులు నెట్టుకొస్తున్నారు. ఆరు నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రూ.1.54 కోట్లు మంజూరు చేశారు. 14 దుకాణాలు మాంసం, 28 దుకాణాలను కూరగాయలు, పండ్ల విక్రయాలకు కేటాయించనున్నారు. అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. రామాయంపేట

# కొత్త రూపు.. సౌకర్యాలు మెరుగు..!

మెదక్ :ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు హవేలిఘనపూర్ మండలం రాజ్‌పేటలో మన ఊరు-మన బడి పథకం ద్వారా పలు పనులు చేపట్టారు. శౌచాలయాలు, సంపు, నల్లాల బిగింపు పనులు పూర్తయ్యాయి. రూ.7.50 లక్షలు వెచ్చించారు.వెల్దుర్తి మండలం మంగళపర్తి ప్రాథమిక పాఠశాలలో తాగునీటి వసతి, విద్యుత్తు, ఇతరత్రా పనులకు రూ.3.07 లక్షలు మంజూరయ్యాయి. రూ.16,857తో తాగునీటి వసతి, రూ.55,000లతో విద్యుత్తు పనులు చేపట్టగా, మరమ్మతులకు రూ.1.21 లక్షలు వెచ్చించారు. మండలంలోని యశ్వంతరావుపేట, కుకునూర్ పాఠశాలల్లో సైతం పనులు పూర్తయ్యాయి.

రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతేడాది దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. జిల్లాలో తొలి విడతలో పలు బడులను ఎంపిక చేయగా, ఆయా శాఖల అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ మేరకు పనులు షురూ చేయగా, తొలుత నిధుల కొరతతో మందకొడిగా సాగాయి. ఆ తర్వాత క్రమంగా నిధులు విడుదల చేయగా ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ముందుగా 42 పాఠశాలల ప్రారంభానికి అధికారులు నిర్ణయించారు.

12 రకాల పనులు..

శిథిల గదులు.. డ్రైనేజీ వ్యవస్థ లేక శౌచాలయాలు, మూత్రశాలలు మురుగు స్తంభించడం, గదులు లేక ఆరుబయట వంటలు, ఫర్నీచర్ సౌకర్యం లేక నేలబారు చదువులు ఇది ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న దుస్థితి. అప్పుడప్పుడు అరకొర నిధుల మంజూరుతో గదులు, శౌచాలయాల నిర్మించేవారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రభుత్వం వాటి స్థితిగతులు మార్చే లక్ష్యంతో 'మన ఊరు-మన బడి' ద్వారా 12 రకాల పనులకు నిధులు కేటాయిస్తోంది. వసతులు మెరుగుపర్చాలని సూచించింది.

రూ.30 లక్షలకు పైగా..జిల్లాలో 898 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, తొలి విడతలో 313 ఎంపిక చేశారు. రూ.30 లక్షలకు పై, అంతకన్న తక్కువ నగదు ఉన్నవిగా రెండు విభాగాలుగా విభజించారు. రూ.30 లక్షల్లోపు 256, ఆపైన ఉన్నవి 57 వరకు ఉన్నాయి. బాధ్యతలను ఇంజినీరింగ్ శాఖ అధికారులకు అప్పగించారు. వారు పాఠశాలలను సందర్శించి, చేపట్టాల్సిన పనులు గుర్తించి ప్రతిపాదించారు. ఆమోదం లభించాక టెండర్లు ఆహ్వానించారు.తొలి విడతలో..తొలి విడతలో 42 పాఠశాలలను ప్రారంభించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. మండలానికి రెండు చొప్పున ఎంపిక చేశారు. మరమ్మతులతో పాటు శౌచాలయాలు, మూత్రశాలలు, చేతులు కడుక్కునేందుకు నల్లాల బిగింపు, విద్యుత్తు, సంపు నిర్మాణాలు చేపట్టారు. అల్లాదుర్గం, చేగుంట, చిలప్‌చెడ్, హవేలిఘనపూర్, కొల్చారం, మనోహరాబాద్, మాసాయిపేట, నర్సాపూర్, పాపన్నపేట, రేగోడ్, చిన్నశంకరంపేట, పెద్దశంకరంపేట, శివ్వంపేట, టేక్మాల్, తూప్రాన్, వెల్దుర్తి మండలాల్లో సిద్ధమయ్యాయి. 36 చోట్ల పనులు పూర్తవగా, మరో ఆరింట కొనసాగుతున్నాయి. ఈ విషయమై డీఈవో రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# త్వరలో క్రీడా ప్రాంగణాలకు ఆట వస్తువులు

జనగామ : జిల్లాలో గతేడాది నుంచి నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలు త్వరలో కళకళలాడనున్నాయి. యువకులు ఆటలు ఆడుకునేందుకు ఈ నెల 15వ తేదీలోగా క్రీడా సామగ్రిని అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, పిల్లలు ఆటలు ఆడుకునేందుకు ప్రభుత్వం గతేడాది అన్ని పంచాయతీల్లో ఎకరం విస్తీర్ణంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ప్రారంభించింది. ఒక్కో ప్రాంగణానికి రూ.2 లక్షల చొప్పున ఉపాధిహామీ నిధులను వెచ్చించింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 వేల ప్రాంగణాలను ఏర్పాటు చేయగా వీటిలో 16 వేల ప్రాంగణాలకు క్రీడా సామగ్రిని అందజేయనుంది. దీంతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో యువకులు, పిల్లలు తమకు నచ్చిన ఆటలు ఆడుకునే వెసులుబాటు కలగనుంది.

పూర్తి స్థాయిలో వినియోగంలోకి..

పలు క్రీడా ప్రాంగణాల్లో ఆట వస్తువులు లేకపోవడంతో బాలలు, యువకులు వెళ్లి ఆడుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు క్రికెట్ తదితర క్రీడలకు సంబంధించిన




కిట్లను ప్రజాప్రతినిధుల సమక్షంలో అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కిట్‌లో ఉండే వస్తువులివీ..కొలతల టేపు 1, డిస్కస్ త్రో కిలో, రెండు కిలోలవి, టెన్నీకాయిట్ రింగ్స్ 6, స్కిప్పింగ్ తాళ్లు 4, ప్లాస్టిక్ విజిల్స్ 3, స్టాప్ అండ్ గో గడియారాలు 1, టీ షర్టులు 75, ఆట వస్తువులను భద్రపరిచే కిట్ 1, జిమ్‌కు సంబంధించి 2.5, 5, 7.5 కిలోల డంబెల్స్ మూడు సెట్లు, వాలీబాల్ సింథటిక్ 1, నెట్ 1, బంతిలో గాలి నింపే పంపు (పెద్దది) 1, క్రికెట్ బ్యాట్ (నెం.5) కశ్మీర్ విల్లో 1, ఫుల్‌సైజు బ్యాటు 1, బ్యాట్స్‌మన్ గ్లౌజులు రెండు జతలు, వికెట్ కీపర్ గ్లౌజులు ఒక జత, లెగ్ ప్యాడ్లు రెండు జతలు, వికెట్ కీపర్ లెదర్ ప్యాడ్లు రెండు జతలు, వికెట్ కీపర్ లెగ్ గార్డులు జత, స్టంప్స్ సెట్ 2, అబ్డామినల్ గార్డులు రెండు జతలు, బంతులు 6, ఆర్మ్ గార్డ్స్ 2, డై ప్యాడ్లు 4 ఉంటాయి.

# ఐరాసకు నచ్చినా.. పాలకులు మెచ్చలే

నల్గొండ : ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామంగా నిలిచిన భూదాన్ పోచంపల్లిలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. 2021 నవంబరులో అవార్డు ప్రకటించిన అనంతరం కేంద్ర, రాష్ట్ర పర్యాటక మంత్రులు కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ స్పందిస్తూ గ్రామాభివృద్ధికి మరింత చేయూతనిస్తామన్న హామీలు ఇప్పటికీ నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ఏడాదిన్నర గడుస్తున్నా.. గ్రామానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం గమనార్హం. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెరుగైన వసతి, మౌలిక వసతులు కల్పిస్తే రాజధానికి సమీపంలో ఉన్న పర్యాటక గ్రామం మరింత అభివృద్ధి చెందే అవకాశముందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. (ఆగస్టు 7న) చేనేత దినోత్సవం సందర్భంగానైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదలకు సంబంధించి తీపికబురు వినిపిస్తుందేమోనని ఆశగా చూస్తున్నారు.

ఒకప్పుడు కళకళ.. ఇప్పుడు వెలవెల

ఐకరాజ్యసమితి (ఐరాస) మెచ్చిన ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామంలో ప్రస్తుతం మౌలిక వసతుల కల్పనకు సంబంధించి నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దేశంలోనే ఇక్కత్ కళకు పేరొందిన ఈ గ్రామంలో పర్యాటకులు సేద తీరడానికి పార్కులు, సరైన హోటళ్లు లేకపోవడంతో ఇక్కత్ చీరల కొనుగోళ్లకు వచ్చే వారు హైదరాబాద్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇక్కడి చేనేత కార్మికులకు ఏడాదంతా సరిపడా ఉపాధి లభించడం లేదు. కొవిడ్‌కు ముందు కొనుగోళ్లు, ఆర్డర్లతో కళకళలాడిన పోచంపల్లి వస్త్ర పరిశ్రమ, కొవిడ్ అనంతర పరిస్థితులు, వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ పిడుగుతో రోజురోజుకూ దివాళా తీస్తోంది. ఐదారేళ్ల క్రితం గిరాకీ మెండుగా ఉండటంతో షోలాపూర్, హైదరాబాద్, సూరత్, భీవండి ప్రాంతాలకు వలస వెళ్లిన నేత కార్మికులు తిరిగి గ్రామాలకు వచ్చి చీరలు నేశారు. ప్రస్తుతం గతంలో ఉన్న పరిస్థితులే దాపురించడంతో ఉపాధి కరవై తిరిగి ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వలసలు వెళ్లడానికి సన్నద్ధమవుతున్నారు.

మూడేళ్ల క్రితం వరకు హైదరాబాద్‌ను సందర్శించడానికి వచ్చే విదేశీ పర్యాటకులు తప్పకుండా పోచంపల్లిని సందర్శించేవారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డీ), జాతీయ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ (నిఫ్ట్) విద్యార్థులు నిత్యం గ్రామాన్ని సందర్శించి నేరుగా నేతన్నల నుంచే వస్త్రాలను కొనుగోలు చేసేవారు. దీంతో మధ్య దళారులు లేకపోవడంతో నేతన్నకు కొంత ఆదాయం వచ్చేది. ఇప్పుడు పర్యాటకుల రాక లేకపోవడంతో పాటూ గ్రామంలో కనీసం పర్యాటకులకు పార్కులను సైతం అభివృద్ధి చేయకపోవడంతో ఎవరూ ఇక్కడకు వచ్చి చీరలను కొనుగోళ్లు చేయడానికి సుముఖత చూపడం లేదని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర వృత్తుల్లోకి నేతన్నల వలస

ఒకప్పుడు ఒక మాస్టర్ వీవర్ కింద 30 మంది పని చేసేవాళ్లు. అందరికీ నెలంతా పని దొరికేది. ప్రస్తుతం 10 మంది వరకే పనిచేస్తున్నారు. గతంలో ఆరు నుంచి 8 మగ్గాలు నేసేవారు, ఇప్పుడు సగానికి సగం తగ్గించారు. కొవిడ్ అనంతరం ముడి సరకు ధరలు పెరగడంతో పాటూ కేంద్రం జీఎస్టీను విధించడంతో కోలుకోలేకపోతున్నామని మాస్టర్‌వీవర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు 7 చీరలు నేసినా...సుమారు రూ.30వేల వరకు ఖర్చు అయ్యేదని, ఇప్పుడు అది రూ.60 వేలకు మించిపోతుందని వాపోతున్నారు. గతంలో ఉన్న ఆదాయం ప్రస్తుతం లేకపోవడం, ఖర్చులు పెరగడంతో నేతన్నలు ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోతున్నారు.గతంలో ఉన్న ఆదాయం లేదు– అంకం మురళి, మాస్టర్ వీవర్, పోచంపల్లిజీఎస్టీ, కొవిడ్ మమ్మల్ని నిలువునా ముంచాయి. గతంలో ఉన్న ఆదాయం లేదు. పూర్తిగా కష్టాల్లో కూరుకుపోయాం. చీరలు నేస్తే నష్టమే వస్తోంది. దీంతో పనిచేయకుండా ఉంటేనే మేలు.

# స్త్రీనిధి రుణాలు.. ఉపాధి వెలుగులు



భూపాలపల్లి : గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా మరింత ఎత్తుకు ఎదగడానికి ప్రభుత్వం ఏటా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తోంది. దీంతో మహిళా సంఘాల సభ్యులు వ్యాపారాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుండటంతో అతివల స్వయం ఉపాధిని బలోపేతం చేసేలా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పలు పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు పాడి గేదెలు, పెరటి కోళ్ల పెంపకం, ఈ–ఆటో, సోలార్ యూనిట్లు, కూరగాయల పందిరి సాగు తదితర పథకాలను అమలు చేసి మహిళలు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఇంటింటా సౌర వెలుగులు

సౌర విద్యుత్తు వినియోగం పల్లెల్లోనూ ఉండేలా స్త్రీనిధి పథకం ద్వారా రుణాలు అందిస్తున్నారు. ఇందులో రెండు రకాల యూనిట్లు మంజూరు చేస్తున్నారు. 2 కిలో వాట్ యూనిట్ సంబంధించి రూ.1.44 లక్షలు ఉండగా రూ.29 వేలు రాయితీ ఉంటుంది. అలాగే 4 కిలోవాట్స్ యూనిట్ విలువ రూ.2.64 లక్షలు కాగా అందులో రూ.43 వేలు రాయితీ ఉండనుంది.

పెరటి కోళ్లు

పెరటి కోళ్ల పెంపకానికి యూనిట్లు అందించేలా ప్రణాళిక తయారు చేశారు. కోడి పిల్లల పెంపకం (మదర్ యూనిట్)లో కోడి పిల్లల కొనుగోలు, వాటి నిర్వహణకు సంబంధించి రూ.2.91 లక్షలను మంజూరు చేస్తున్నారు. 100 వరకు పెరటి కోళ్ల పెంపకానికి సంబంధించి రూ.22 వేల రుణం మంజూరు చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో కోళ్లకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో మహిళలు పెంపకాన్ని చేపట్టి ఆర్థికంగా ఎదగడానికి దోహదపడుతుందని అధికారులు అంటున్నారు.

గొర్రెలు మహిళా సంఘాలు గొర్రెల పెంపకంపై దృష్టి సారించి ఆదాయ మార్గాలను పెంచుకునే ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా గొర్రెల పెంపకానికి సంబంధించిన యూనిట్లు మంజూరు చేస్తున్నారు. దీనిలో ఒక్కో యూనిట్‌కు రూ.లక్ష వరకు రుణాలు అందిస్తున్నారు. తెలంగాణలో మాంసానికి భారీగా డిమాండ్ ఉన్నందున గొర్రెల యూనిట్ నెలకొల్పి ఆర్థికంగా ఎదగవచ్చు.

ఈ–ఆటో, ద్విచక్ర వాహన పథకం

మహిళా సంఘాల కుటుంబాలు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి పొందే అవకాశం ఉండేలా ఈ–ఆటో పథకాన్ని అమలు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఒక్కో యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఉంటుంది. ఈ– ద్విచక్రవాహనం కొనుగోలు చేసేందుకు రూ.75 వేల రుణం అందిస్తున్నారు. తీసుకున్న రుణాలను తక్కువ వడ్డీతో నెలనెలా చెల్లించే అవకాశం ఉంది.

పాడి గేదెలు

మహిళా సంఘాల సభ్యులు పశు పోషణలోనూ రాణించి ఆర్థికంగా ఎదిగేలా పాడిగేదెల పెంపకం పథకాన్ని అమలు చేస్తున్నారు. ఒక్కో యూనిట్ విలువ రూ.93,270 వరకు ఉంటుంది. మేలు జాతి పాడిగేదెల పెంపకం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు నిత్యం ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది. తీసుకున్న రుణాలు వాయిదా పద్ధతిలో చెల్లించే వెసులుబాటు ఉంది.

మరెన్నో...

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి స్త్రీనిధిలో మరెన్నో పథకాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా పందిరి కూరగాయల సాగుకు సంబంధించి రూ.లక్ష రుణం ఇవ్వనున్నారు. మంచి పనితీరు కనబరుస్తున్న మండల సమాఖ్యలకు కస్టమ్ హైరింగ్ సెంటర్ (వ్యవసాయ అద్దె పరికరాల) పథకంలో భాగంగా రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలు అందించనున్నారు. దీని ద్వారా వ్యవసాయ పరికరాలను రైతులకు అద్దెకు ఇచ్చి ఆదాయం సమకూర్చుకునే అవకాశం కల్పించారు. అలాగే జనరిక్ ఔషధాల దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు కూడా రుణాలు అందిస్తున్నారు. పథకానికి సంబంధించి రుణాలు తీసుకునే మహిళా కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఒకరు తప్పనిసరిగా బీ ఫార్మసీ చేసిన వారై ఉండాలి. అలాంటి వారికి ఒక్కో యూనిట్‌కు రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. ఇంటి మరమ్మతులకు సంబంధించి రూ.75 వేల వరకు రుణాలు అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి– పురుషోత్తం, డీఆర్‌డీవో, భూపాలపల్లి

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందించి వివిధ రకాల పథకాలను అమలు చేస్తోంది. సూక్ష్మ రుణాల నుంచి విముక్తి పొందేలా స్త్రీనిధి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో 48 గంటల వ్యవధిలో రుణ సదుపాయం పొందే అవకాశం ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం– రామ్‌నారాయణ, స్త్రీనిధి రీజనల్ మేనేజర్

స్త్రీనిధి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎన్నో మంచి పథకాలను అమలు చేస్తోంది. పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రతి మండలం, గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. పెరటికోళ్ల పెంపకం, పాడిగేదెలు, ఈ–ఆటో పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి వివిధ రకాల యూనిట్లు ఎంతో ఉపయోగపడతాయి.

# తరగతుల నిర్వహణకు సిద్ధమవుతున్న వైద్య కళాశాల

జనగామ : జనగామలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాల.. తరగతుల నిర్వహణకు సిద్ధమవుతోంది. తరగతి గదుల భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సెప్టెంబరు నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

సమకూరుతున్న వసతులు

వైద్య కళాశాలకు శాశ్వత భవన నిర్మాణానికి సిద్ధిపేట రోడ్డు వైపు 18 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. జిల్లా ఆసుపత్రి, మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రి(ఎంసీహెచ్) బోధనాసుపత్రులుగా మారాయి. శాశ్వత కళాశాల భవనం, వసతిగృహాలు నిర్మించే వరకు మొదటి బ్యాచ్ నిర్వహణకు గాను తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జనగామ ఎంసీహెచ్ ఆసుపత్రి పక్కనే వైద్య కళాశాలకు అనుబంధంగా మరో 50 పడకలతో క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణం ప్రారంభమైంది. ఇదే స్థలంలో జనగామ వైద్య కళాశాలలో మొదటి బ్యాచ్‌లో వైద్యవిద్య అభ్యసించనున్న 100 మంది విద్యార్థులకు తరగతుల నిర్వహణకు తాత్కాలిక వసతులతో కూడిన గదులను నిర్మిస్తున్నారు. ఎంసీహెచ్ పై అంతస్తులో వైద్య కళాశాల పరిపాలన విభాగం కోసం గదులు నిర్మించారు. రానున్న 15 రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని వైద్య వర్గాలు తెలిపాయి. ఈ పనులను రూ.23 కోట్లతో చేపట్టారు. పట్టణంలోని ధర్మకంచలో గతంలో పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు నిర్వహించిన భవనాన్ని ఎంబీబీఎస్ చదివే విద్యార్థినుల కోసం కేటాయించారు. పురుషుల కోసం సిద్ధిపేట రోడ్డు వైపు ఉన్న ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని కేటాయించారు.

విధుల్లో చేరిన ఆచార్యులు

వైద్య కళాశాలలో తరగతులు బోధించేందుకు, బోధనాసుపత్రులుగా ఉన్న జిల్లా జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రిలో వైద్య సేవలందించడానికి ఆచార్యులు, సహాయ ఆచార్యులు విధుల్లో చేరారు. అన్ని విభాగాల్లో కలిపి 90 మంది ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యులు విధుల్లో చేరి జిల్లా ఆసుపత్రి, ఎంసీహెచ్‌లో



సేవలందిస్తున్నారు. వైద్య కళాశాలకు ప్రిన్సిపల్‌గా డాక్టర్ గోపాల్‌రావు వ్యవహరిస్తున్నారు. డీఎంఈ నుంచి పూర్తి స్థాయిలో సూపరింటెండెంట్ ఇంకా రాలేదు. ప్రస్తుతం వైద్య విధాన పరిషత్‌కు చెందిన డాక్టర్ సుగుణాకర్‌రాజు రెండు బోధనాసుపత్రులకు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, గైనిక్, అనస్తీషియా, ఫోరెన్సిక్, యూరాలజీ, న్యూరాలజీ, ఆప్తాల్మిస్ట్, ఆర్థోపెడిక్ వంటి కీలక విభాగాల్లో వైద్యులు చేరి సేవలందిస్తున్నారు. వీరంతా ఎంబీబీఎస్ విద్యార్థులకు బోధనతో పాటు రెండు ఆసుపత్రుల్లో సేవలందిస్తారు.

నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

వైద్య కళాశాలలో చేరేందుకు నీట్ కౌన్సెలింగ్‌లో మొదటిసారిగా 15 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తమ ఐచ్ఛికాన్ని (ఆప్షన్) నమోదు చేసుకున్నారు. మొత్తం 100 సీట్లు ఉండగా.. 80 శాతం సీట్లు రాష్ట్ర విద్యార్థులకే దక్కనున్నాయి. మిగతా 20 శాతం సీట్లను ఇతర ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు. జనగామకు రైల్వే, రోడ్డు మార్గాలు ఉండటంతో ఈ వైద్య కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తారని భావిస్తున్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం డాక్టర్ సుగుణాకర్‌రాజు, జిల్లా జనరల్ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్

వైద్య కళాశాలలో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా విశాలమైన తరగతి గదులు, ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. పనులన్నీ తుది దశలో ఉన్నాయి. డీఎంఈ నుంచి వచ్చిన వైద్యులు విధుల్లో చేరారు. సెప్టెంబర్ నుంచి తరగతులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

# గోదావరి జలం.. పంటలకు వరం!

వరంగల్ : రాష్ట్రంలో భారీ వర్షాలు కురవడంతో ప్రధాన ప్రాజెక్టులు, జలాశయాలకు జలకళ వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నవంబరు 7వ తేదీ వరకు నీటిని విడుదల చేయాలని జల వనరుల శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. నాలుగు రోజుల క్రితం కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యాం నుంచి నీటిని విడుదల చేశారు. కాకతీయ కాలువ ద్వారా ఎస్సారెస్పీ నీరు హనుమకొండ జిల్లాకు చేరాయి. వారబందీ విధానంలో వారం రోజులు ఎస్సారెస్పీ మొదటి దశకు, రెండో వారంలో రెండో దశ ఆయకట్టుకు నీరందిస్తారు. ఈ సీజన్‌లో పంటలకు మొత్తం 38.099 టీఎంసీలు, మిషన్ భగీరథకు 3.162 టీఎంసీల నీటిని వేర్వేరుగా సరఫరా చేయాలని నిర్ణయించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు కాకతీయ కాలువ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 6 లక్షల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. గత సంవత్సరం 4.99 లక్షల ఎకరాలకు సరఫరా చేశారు. ఈసారి అదనంగా మరో లక్ష ఎకరాలకు ఇవ్వాలని ప్రతిపాదించారు. మొదటి దశ కింద 2 లక్షల ఎకరాల ఆయకట్టును నిర్ధారించారు. దీనికోసం 1.96 లక్షల క్యూసెక్కులు కేటాయించారు. ప్రతి రోజు 4 వేల క్యూసెక్కుల చొప్పున వారం రోజులకు 28 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. రెండో దశ కింద 4 లక్షల



ఎకరాల ఆయకట్టును నిర్ధారించారు. 2.45 లక్షల క్యూసెక్కులు కేటాయించగా.. ప్రతిరోజు 5 వేల క్యూసెక్కుల చొప్పున వారం రోజులకు 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. అలాగే అవసరాల మేరకు చెరువులు, కుంటలను నింపుతారు.

మిషన్ భగీరథకు....

మిషన్ భగీరథ రిజర్వాయర్లకు సైతం 122 రోజుల పాటు నీటిని సరఫరా చేస్తారు. ఇందుకు ప్రత్యేకంగా 36,600 క్యూసెక్కుల నీటిని కేటాయించామని వరంగల్ జలవనరుల శాఖ డిప్యూటీ సీఈ సారంగం తెలిపారు. మొదటి దశలోని కాకతీయ కాలువ 146 కిలోమీటరు నుంచి 284 కిలోమీటరు వరకు గల ఆయకట్టుకు వర్ధన్నపేట మండలం ఇల్లంద వరకు, రెండో దశ 285 కిలో మీటరు నుంచి 346 కిలోమీటర్ల వరకు సాగునీరు అందిస్తామని సారంగం తెలిపారు.

# అధ్యక్షా.. సమావేశం ఎప్పుడు?

భువనగిరి : భువనగిరి పురపాలక సంఘం సర్వసభ్య సమావేశాలు నెలల తరబడి జరగకపోవడంతో వార్డుల్లో సమస్యలు తిష్ఠవేశాయి. ఆవాస ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి నిర్మాణాల విషయమై ప్రతి నెలా పాలకవర్గం సభ్యులు సమావేశమై ఏజెండా అంశాలపై చర్చించాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పాలకవర్గం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం జరిగి మూడు నెలలు దాటినప్పటికి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయకపోవడంపై పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత నిబంధనల మేరకు మూడు నెలలలోపు సర్వసభ్య సమావేశం నిర్వహించని పక్షంలో పాలకవర్గం సభ్యులు అనర్హతకు గురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత కొత్త చట్టం ప్రకారం మూడు నెలల వ్యవధిలో జరిగే ప్రత్యేక సమావేశాలను పరిగణనలోకి తీసుకుంటుండటంతో సమావేశం ఏర్పాటు చేయకున్నా ఏం కాదన్న ధీమా పురపాలకుల్లో వ్యక్తమవుతోంది. ప్రత్యేక సమావేశంలో ఒక ఏజెండాపై చర్చ జరుగుతోంది. సర్వసభ్య సమావేశంలో పదుల సంఖ్యలో ఏజెండా అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగి ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకునే అవకాశం ఉండటం గమనార్హం.

ఇదీ పరిస్థితి...నిర్ణీత సమయంలో పాలకవర్గం సర్వసభ్య సమావేశం జరగని కారణంగా.. ఆవాస ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ప్రజలు, కౌన్సిలర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు, దోమలు విజృంభణ, వీధిదీపాలు వెలగకపోవడం, రంగు మారి సరఫరా అవుతున్న నీటి సమస్యలు ఉన్నాయి. గత కొద్ది నెలలుగా టీయూఎఫ్ఐడీసీ, పట్టణ ప్రగతి, ప్రత్యేక నిధులతో కోట్లాది రూపాయల విలువైన నిర్మాణ పనులు



కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పురపాలికలో పనిచేస్తున్న పదుల సంఖ్యలోని ఉద్యోగులు ఇతర మున్సిపాలిటీల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తుండటం క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారంలో జాప్యం నెలకొంటున్నట్లు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. సమావేశం నిర్వహించకపోవడంతో గత కొద్ది నెలలుగా మున్సిపాలిటీకి లభిస్తున్న ఆదాయం, వ్యయం లెక్కలు తెలియడం లేదని కౌన్సిలర్లు వాపోతున్నారు.

అభివృద్ధి కుంటుపడుతోంది

– పోత్నక్ ప్రమోద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్

నిర్ణీత సమయంలో సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేయని కారణంగా పట్టణాభివృద్ధి కుంటుపడటంతో పాటు ప్రజలు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. సమావేశం ఏర్పాటు చేయాలని కోరినప్పటికి పట్టించుకోవడంలేదు. ఎలాంటి ముందస్తు నిబంధనలు పాటించకుండా, నాణ్యత లేమితో పట్టణంలోని అన్ని వార్డుల్లో కోట్లాది రూపాయల పనులు జరుగుతున్నాయి. ఈ విషయమై లోకాయుక్త, విజిలెన్స్ శాఖలకు ఫిర్యాదు చేస్తాం.అనివార్య కారణాలతో ఏర్పాటు చేయలేదు– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషన్అనివార్య కారణాలతో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయలేదు. అత్యవసరంగా మధ్యలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాం. సమావేశం ఏర్పాటుకు ఎజెండా రూపొందిస్తున్నాం. త్వరలోనే ఏర్పాటు చేస్తాం.

# గుంతల నిర్మాణంలో డీలా నీరు ఇంకేదెలా?

ఖమ్మం : ప్రతి నీటి బొట్టు ముందు తరాలకు తొలిమిట్టు. వాటిని సంరక్షించుకుంటే భవిష్యత్తు భరోసా. ఆ నీటిని భూమిలోకి ఇంకింపజేసి భద్రంగా నిల్వచేయాలనే తలంపుతో ప్రభుత్వం గ్రామాల్లోని ఇళ్లు, చేతిపంపుల వద్ద ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టింది. వర్షపునీరు మురుగు కాలువల ద్వారా వృథాగా పోతున్నాయి. ఈ పరిస్థితి నివారించేందుకు మురుగు కాలువల చివర కమ్యూనిటీ ఇంకుడుగుంత నిర్మించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామపంచాయతీలో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించగా జిల్లాలో ఆ పనులు మందకొడిగా సాగుతున్నాయి.

ప్రతి పంచాయతీలో అయిదు చొప్పున..


జిలాల్లో 589 గ్రామపంచాయతీలుండగా ప్రతి పంచాయతీలో 5చొప్పున మొత్తం 2945 కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. 233 గ్రౌండింగ్ కాగా ఇప్పటివరకు 146 నిర్మాణాలే పూర్తయ్యాయి. వీటిని మురుగు కాలువల చివరన నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. వర్షాలు కురవడం, కాలువల చివరలో స్థల సమస్య కారణంగా పనుల్లో జాప్యం



జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చేతిపంపులు వద్ద కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023' అవార్డు సాధించడానికి జిల్లాలో 15 గ్రామపంచాయతీలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి నామినేట్ చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌కు నామినేట్ అయిన గ్రామాల్లో మాత్రం మండలస్థాయి అధికారులు దృష్టిసారించారు. ఆయా గ్రామాల్లో నిర్మాణాలు వేగంగా పూర్తయ్యాయి. ఇలా ముదిగొండ మండలంలోని మేడేపల్లి, పమ్మి, మల్లన్నపాలెం గ్రామాల్లో మొత్తం 16, మేడేపల్లిలో అత్యధికంగా పది నిర్మించారు. గతంలో కొన్ని గ్రామపంచాయతీల్లో చేతిపంపులు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయం ఆవరణలలో నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల వర్షాలకు వరద నీరంతా కాలువలు, నదులు, సముద్రంలో కలిసింది. వర్షపునీరు, వృథా నీటిని భూమిలోకి ఇంకింపజేస్తే గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. వాటి వినియోగంతో వేసవిలో నీటి ఎద్దడి తొలగించుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని నిర్మాణాలు వేగవంతం చేస్తే అనుకున్న లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. ఈ నెలాఖరులోపు నిర్మాణాలు పూర్తిచేస్తాం: విద్యాచందన, డీఆర్డీవో భారీ వర్షాలు వల్ల కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణాల్లో జాప్యం జరిగింది. ఈనెలాఖరులోగా నిర్మాణాలు పూర్తిచేస్తాం.

# గిరిజన ప్రాథమిక విద్యకు నూతన సొబగులు

భద్రాచలం : గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేయడంతో పాటు కార్పొరేట్ హంగులు కల్పిస్తూ విద్యార్థులను ఆకట్టుకునే దిశగా పురోగతి సాగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇవి 219 ఉండగా.. వీటిల్లో సుమారు 5,100 మంది బాలబాలికలు చదువుతున్నారు. 1 నుంచి 5వ తరగతి బోధన కొనసాగుతోంది. ఐటీడీఏ అధికారుల చొరవతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న వాటికి నూతన సొబగులు అద్దుతున్నారు. మూడేళ్ల కిందట 20 గిరిజన ప్రాథమిక పాఠశాలలను మోడల్‌గా తీర్చిదిద్దగా ఆ తర్వాత రెండేళ్లలో మరో 20కి ఈ సదుపాయం కల్పించారు. ప్రహరీ లేని చోట ఫెన్సింగ్‌కు రూ.లక్ష, జారుడు బల్ల వంటి క్రీడా సామగ్రికి రూ.1.5 లక్షలు, పెయింటింగులకు రూ.50 వేలు, విద్యుత్తు సదుపాయానికి రూ.20 వేలు, మరుగుదొడ్లకు రూ.50 వేలు, వంటశాలకు రూ.30 వేల



చొప్పున కేటాయించి మొత్తంగా ఒక్కో పాఠశాలకు రూ.4 లక్షలు సమకూర్చారు. జిల్లాలో ఈ మూడేళ్లలో 40 మోడల్ పాఠశాలలకు రూ.1.6 కోట్లు వెచ్చించారు.

ఆహ్లాదకర వాతావరణం ఉండేలా..

గిరిజన విద్యార్థులు బడి బాట పట్టాలంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందే. ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లలను రప్పించేందుకు తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలి. ఇందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకున్నా విద్యాలయంలో వాతావరణం బాగాలేక పోతే గిరికూనలు డ్రాపవుట్ అయ్యే వీలుంది. దీన్ని గుర్తించిన అధికారులు పాఠశాలలకు కావాల్సిన సదుపాయాలపై ఆయా ప్రధానోపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు తీసుకున్నారు. 2021-22, 2022-23, 2023-24లో 162 పనులను ప్రతిపాదించగా 144 పనులు పూర్తి చేశారు. ఇందుకు రూ.4.59 కోట్లు వెచ్చించారు. 5 పనులు ప్రగతిలో ఉండగా 13 పనులు వేర్వేరు కారణాలతో ఆగాయి. ఈ ఏడాది మరో 26 బడుల్లో మౌలిక సదుపాయాలకు ప్రతిపాదనలు తయారు చేశారు. మిగతా వాటిల్లోనూ పనులు చేపట్టాల్సి ఉంది.

నాణ్యమైన బోధన అందించాలని..

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, పాఠశాల స్థాయి వసతి గృహాలు 63 ఉండగా ఇందులో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 18 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. కరోనా కాలంలో ఆన్‌లైన్ విద్యా బోధన వల్ల నాణ్యమైన బోధన అందలేదు. దీంతో కింది స్థాయి తరగతుల్లో చాలా మందికి చదవడం రాయడం పూర్తిస్థాయిలో రాలేదు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. దాదాపు 15 వేల మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం అంశాలలో పరీక్ష నిర్వహించి వారి విద్యా ప్రమాణాలు అంచనా వేయనున్నారు. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపనున్నారు. నూతన పీవో ప్రతీక్ జైన్ ఈ దిశగా దృష్టి సారించి నాణ్యమైన విద్య అందరికీ అందించాలని భావిస్తున్నారు.

# తనఖా రుణాలకు తొలగిన అడ్డంకులు




ఖమ్మం : ఏజెన్సీ ప్రాంతాల్లో మార్ట్‌గేజ్ రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఈ మేరకు ధరణిలో కొత్త ఆప్షన్ చేర్చారు. దీంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో.. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల నుంచి భూమి తనఖా రుణాలు పొందే అవకాశం ఏర్పడింది. పంట రుణాలు తీసుకున్న వారితో పాటు తీసుకోని వారు కూడా ఇతర రుణాలు పొందే వెసులుబాటు కోసం ఎదురుచూస్తున్నారు. వీరందరికీ తాజా నిర్ణయం ఉపశమనం కలిగించేదే.

'ధరణి' రాకతో సమస్య

2020, నవంబరు నుంచి 'ధరణి' పోర్టల్ అమలులోకి వచ్చింది. మార్ట్‌గేజ్ రుణాలు పొందే ఆప్షన్ ఇందులో లేదు. అప్పట్నుంచి ఏజెన్సీలో బ్యాంకులు పంట రుణాలకే పరిమితం అయ్యాయి. ధరణికి ముందు కొన్ని దశాబ్దాల పాటు రైతులు మార్ట్‌గేజ్ రుణాలు పొందేవారు. ఆ తర్వాత ఇబ్బందులకు గురవుతూ వచ్చారు. తనఖాపై 'భూమి అభివృద్ధి', 'కర్షక మిత్ర' పథకాలు, ఉద్యాన పంటల బిందు, తుంపర్ల సేద్యం, వ్యవసాయ పరికరాలు, ఆయిల్ ఇంజిన్లు, మోటార్ల కొనుగోలు, ఫౌల్ట్రీ రంగానికి సంబంధించి దీర్ఘకాలిక రుణాలిచ్చేవారు. కొంతకాలంగా డిమాండ్ ఉన్న విద్యా రుణాలూ అన్నదాతల వారసులకు దూరమయ్యాయి. దీంతో ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, కామేపల్లి, కారేపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాలు, ములుగు, మహబూబాబాద్ జిల్లాల విద్యార్థులు ఉన్నత, విదేశీ విద్యకు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పట్టా భూములున్నా తనఖా రుణాలకు నోచుకోవడం లేదు. ఈ విషయమై బాధిత రైతుల నుంచి కొత్తగూడెం పూర్వ కలెక్టర్ అనుదీప్‌కు విన్నపాలు వెల్లువెత్తాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే రైతులు ఏటా సుమారు రూ.300 కోట్ల మేర మార్ట్‌గేజ్ రుణాలు పొందలేక పోయారని అంచనా. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో ఊరట కల్పించనుంది.

'ధరణి పోర్టల్‌లో ఏజెన్సీ రైతులు మార్ట్‌గేజ్ రుణాలు పొందేలా సోమవారం నుంచి ఆప్షన్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. డీసీసీబీ పరిధిలోని బ్యాంకుల్లోనూ దీర్ఘకాలిక రుణాలు పొందే వీలు కలుగుతోంది. విద్యా రుణాలు ఇచ్చేందుకు మా బ్యాంకులు సుముఖంగా ఉన్నాయి. ఆప్షన్ అందుబాటులోకి వచ్చేందుకు కృషిచేసిన వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.' కూరాకుల నాగభూషయ్య, ఛైర్మన్, డీసీసీబీ, ఖమ్మం

# మీ పిల్లల లంచ్ బాక్స్‌లో ఏముంది!



ఖమ్మం : తల్లిదండ్రులకు విజ్ఞప్తి! మీ చిన్నారులకు రోజూ పంపించే అల్పాహారంలో బిస్కెట్లు, తీపి కేకులు, జంక్‌ఫుడ్, ఇన్‌స్టంట్ ఫుడ్, నూనె పదార్థాలతో కూడిన ఆహార పదార్థాలు పంపకండి. తాజా పండ్లు, తేలిగ్గా జీర్ణమయ్యే తాజా ఆహార పదార్థాలను పంపించండి.' సుమారు 2500 మందికి పైగా విద్యార్థులున్న ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రుల వాట్సాప్ గ్రూప్‌లకు పంపిన సందేశమిది.

' ప్రైవేటు స్కూల్‌లో చదువుకునే మా మనుమరాలు (8) కొద్ది నెలలుగా అన్నం సరిగా తినడం లేదు. చాక్లెట్లు, బయట లభించే చిప్స్, కూల్ డ్రింక్స్, కేక్‌లు అంటేనే ఆసక్తి కనబర్చుతోంది. ఇప్పుడామె వయసుకు తగిన బరువు లేకపోగా, చూపు మందగించి కళ్లజోడు పెట్టుకోవాల్సి వస్తోంది.' పొరుగింటి మహిళతో ఖమ్మంకు చెందిన బాలిక అమ్మమ్మ అన్న మాటలివి. ఒత్తిళ్లతో కూడిన విద్య, సరైన ఆహార నియమాలు పాటించకపోవడంతో నేటి బాల్యం అనారోగ్య సమస్యలతో సతమతం అవుతోంది. దాదాపు నాలుగోవంతు మంది పోషకాహార లోపం సంబంధ సమస్యలతో బాధపడుతున్నవారేనని సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి. ముఖ్యంగా బలవర్ధక, పీచు పదార్థాలతో కూడిన ఆహారం, పండ్లకు బదులు చిరుతిళ్లు తినేందుకు ఎక్కువ మంది అలవాటు పడుతున్నారు. ఇదే క్రమంలో విద్యాలయాల చెంత వెలిసిన పలు దుకాణాల్లో నాణ్యతలేని, ఊరూపేరూ లేని చిరుతిళ్లను తినే చిన్నారులు ఆరోగ్యం పాలవుతున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కల్తీ కారాలు, మసాలాలు, నాణ్యతలేని పదార్థాలతో తయారు చేసే చిప్స్, స్నాక్స్, న్యూడిల్స్, ఇన్‌స్టంట్, ప్యాకేజ్డ్ ఫుడ్ తినడం ద్వారా... ప్రతి వంద మంది బాధిత చిన్నారుల్లో ఐదో వంతు మంది పేగుపూత వ్యాధి బారిన పడుతున్నారని తాజాగా ఓ సర్వేలో తేల్చింది. పలువురు ఊబకాయంతో బాధపడేందుకు ప్రమాదకర ఆహార అలవాట్లే కారణమని తేలింది. ఈ సమయంలో పిల్లలకు అల్పాహారంగా అందించే ఆహారాన్ని తల్లిదండ్రులు జాగ్రత్తగా ఎంపిక చేసుకోవడం, నాణ్యమైనదిగా ఉండేలా శ్రద్ధ వహిస్తే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.

ఇదీ.. పరిస్థితిఖమ్మంలోని జిల్లా సర్వజన ఆసుపత్రిలో ప్రతి రోజు పిల్లల విభాగంలో 200 ఓపీ నమోదవుతోంది. చిన్నారుల్లో 25 నుంచి 30 మంది జీర్ణకోశ వ్యాధులతో బాధపడుతున్నవారే.

జిల్లావ్యాప్తంగా అన్ని సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో చిన్నారుల ఓపీ 750 వరకు ఉండగా.. సుమారు వంద మందికి గ్యాస్ట్రో ఎంటరాలజీ సమస్యలు నిర్ధారణ అవుతున్నాయి.

పాఠశాల విరామంలో..విరామ సమయంలో పల్లీపట్టి, ఎండు ఫలాలు, పలు రకాల గింజల(నట్స్)తో చేసిన లడ్డూలు, లేదా అరటిపండు తినేలా చూడాలి. వీటిని తినడం లేదని చిప్స్, చాకెట్లు, బిస్కెట్లు, ఇతర ప్యాకేజ్డ్ ఫుడ్ పెట్టడం తగదు.

మధ్యాహ్న భోజనంలో..

అన్నం లేదా గోధుమ రొట్టెలు, రాగిజావ, ఇతర పప్పులు, కూరగాయలు, సలాడ్, కొద్దిగా పెరుగు వంటివి భోజనంలో ఉండేలా చూసుకోవాలి. సలాడ్, పెరుగు వంటివి లేకపోతే అన్నం, చపాతి, కూరగాయల (వేపుళ్లు చేయనివి) కూరలు వండి పెట్టాలి. పప్పుధాన్యాల్లో మాంసకృత్తులు, సలాడ్లతో వివిధ విటమిన్లు లభిస్తాయి.

సాయంత్రం వేళలో..

పాఠశాల నుంచి వచ్చిన పిల్లలు అలసిపోయి ఉంటారు. ఆ సమయంలో వారికి స్నాక్స్ అందిస్తే శక్తి పెరిగి ఉత్తేజితులవుతారు. తాజా పండ్లతో చేసిన మిల్క్‌షేక్, లేదా పండ్ల ముక్కలు, జ్యూస్, ఓ కప్పు మొలకలు, ఆమ్లెట్

వంటివి పెట్టొచ్చు.

పీచు పదార్థాలతో జీవక్రియలు మెరుగు

చిన్నారుల శరీరంలో విసర్జన వంటి జీవక్రియలు సక్రమంగా జరగాలంటే పీచు పదార్థాలు ప్రముఖపాత్ర పోషిస్తాయి. పేగు క్యాన్సర్లు, ఇతర ప్రాణాంతక జబ్బులు రాకుండా ఇవి కాపాడతాయి. ముతక ధాన్యాలు, చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, బీరకాయ, చిక్కుడుకాయల్లో పీచుపదార్థాలెక్కువ. వీటికి మెనూలో ప్రాధాన్యమివ్వాలి.

విటమిన్ల లోపం దరిచేరకుండా..

ప్రొటీన్లతో పాటు విటమిన్ 'ఎ' లోపం వల్ల పిల్లల్లో త్వరగా దృష్టి సంబంధ సమస్యలు తలెత్తుతాయి. బొప్పాయి, ఆకుకూరలు, క్యారెట్, గుమ్మడికాయ, కర్బూజ, బొబ్బర్లలో విటమిన్ 'ఎ' సమృద్ధిగా ఉంటుంది. దీంతో పాటు ఉదయపు ఎండలో కొద్ది సమయం గడిపేలా చూస్తే విటమిన్ 'డి' శరీరానికి అందుతుంది. చిన్నప్పట్నుంచి చక్కటి ఆహార నియమాలు అలవాటయ్యేలా ప్రోత్సహిస్తే సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేసినట్లు అవుతుంది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్లేవారైతే పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తప్పక చేసుకోవాలి.

చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

స్వరూప, విద్యార్థుల తల్లి, కొత్తగూడెం

మా పాప యూకేజీ, బాబు రెండో తరగతి చదువుతున్నారు. వారికోసం వారం వారం తాజా పండ్లు కొనుగోలు చేస్తాం. వాటితో పాటు ఇంట్లో ప్రత్యేకంగా తయారు చేసిన పోషకాహారాన్నే లంచ్ బాక్సులో పెడతాం. ఆయిల్ ఫుడ్, జంక్‌ఫుడ్ పిల్లలకు ఇష్టమే అయినా.. వాటికి మెనూలో చోటివ్వం. పండ్లు, కూరలే ఆరోగ్యకరమని నచ్చచెబుతుంటాం. వారికి నచ్చిన పండ్లు తెచ్చివడంతో పెద్దగా చిరుతిళ్ల జోలికి వెళ్లడం లేదు.

బయటి పదార్థాలే అనారోగ్యానికి కారణం

పట్టణ ప్రాంత చిన్నారులు జంక్‌ఫుడ్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తింటుంటారు. సమతుల ఆహారం తీసుకోకపోవడంతో వారు నీరసించిపోతున్నారు. కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు తదితర జీర్ణకోశ సంబంధ సమస్యల బారిన ఎక్కువగా పడుతున్నారు. ఓపీలో ప్రతి వందలో 15 నుంచి 20 మంది అజీర్తి లక్షణాలతో బాధపడుతున్నారు. పేగుపూత సమస్య అధికంగా ఉంటుంది. అల్పాహార హోటళ్లు, మొబైల్ టిఫిన్ సెంటర్లు, రోడ్డు పక్కన తోపుడు బండ్లపై లభించే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువగా తలెత్తుతాయి. కల్తీ నూనెలు, మసాలాలు, నాణ్యతలేని పదార్థాలే గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తడానికి కారణమవుతాయి. తల్లిదండ్రులు సంప్రదాయ ఆహారాన్ని అలవాటు చేయడం మేలు. డా.పవన్‌కుమార్, పిల్లల వైద్య నిపుణుడు, ఖమ్మం

# జూనియర్ కళాశాలలకు నిర్వహణ నిధులు

జనగామ : ఎట్టకేలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్వహణ నిధులు మంజూరయ్యాయి. సామగ్రి కొనుగోలుకు కళాశాలల నిర్వాహకులు సొంత డబ్బు వెచ్చించారు. మూడు నెలలకు సంబంధించిన నిధులు విడుదల కావడంతో వారి ఎదురుచూపులకు తెరపడింది. ఈ నిధుల నుంచే విద్యుత్తు బిల్లులు చెల్లించనున్నారు. జిల్లాలో 2015 తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగింది. గురుకులాలు, ఆదర్శ బడులు, కేజీబీవీలు అధిక సంఖ్యలో ఏర్పాటు చేయడంతో ప్రైవేటు యాజమాన్యాలతో తీవ్ర పోటీ నెలకొంది. కొవిడ్‌కు ముందు నుంచి ఆయా కళాశాలలకు నిధులు మంజూరుకాక పోవడంతో స్టేషనరీ, ఇతర సామగ్రిని కళాశాలల ప్రిన్సిపల్‌లు సొంతంగా కొనుగోలు చేశారు. ప్రభుత్వం విడతల వారీగా నిధులు మంజూరు చేస్తుండటంతో అగచాట్లు తప్పడం లేదు. ఒక్కో కళాశాలకు నెలకు సాధారణంగా రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. శౌచాలయాల నిర్వహణకు నెలకు దాదాపు రూ.3 వేల నుంచి రూ.5 వేలు, స్టేషనరీ, పారిశుద్ధ్యం, సాధారణ నిర్వహణకు నిధులు మంజూరవుతాయి. ఇటీవల విడుదలైన నిధుల్లో, త్రైమాసికానికి విద్యార్థికి రూ.70 చొప్పున మంజూరయ్యాయి. ఒక్కొక్కరికి రూ.100 చెల్లించాలని డిమాండ్ ఉన్నా అమలుకావడం లేదు. జిల్లాలో అయిదు ప్రభుత్వ కళాశాలలు ఉండగా.. ప్రథమ సంవత్సరం 365, ద్వితీయ 470 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.1.20 లక్షల నిధులు మంజూరయ్యాయి.

# నాలాలతోనే ముప్పు.. వరద కాలువలే దిక్కు

వరంగల్ :ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరంగల్ ప్రాంతంలో సుమారు 150 కాలనీలు ముంపునకు గురయ్యాయి. భద్రకాళి, ఉర్సు రంగసముద్రం, దేశాయిపేట చిన్న వడ్డేపల్లి చెరువుల పరీవాహక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వరద నీరు పోటెత్తింది. నాలాలే కాలనీలను ముంచెత్తాయి. పాతవి, కచ్చ నాలాలతోనే ఏటా ప్రమాదం ముంచుకు వస్తోంది. వరద కాలువల నిర్మాణమే దీనికి పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు. వీటిపై దృష్టి సారించక పోతే భవిష్యత్తులో ముంపు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. కాలనీలు నీట మునగటానికి గల కారణాలపై ఆదివారం 'న్యూస్‌టుడే' బృందం చేసిన పరిశీలన వివరాలు ఇలా..

పోతననగర్ ఐదు రోజులు వరదల్లోనే..

పోతననగర్, న్యూ పోతననగర్‌లో సుమారు 180 ఇళ్లున్నాయి. ఇక్కడి ఇళ్లు ఐదారు రోజుల పాటు వరద నీటిలోనే ఉన్నాయి. హంటర్‌రోడ్ 12 మోరీలు, భద్రకాళి చెరువు వైపు నుంచి పెద్ద ఎత్తున వరదనీరు రావడంతో పాతకాలం నాటి నాలా కూలిపోవడం, భద్రకాళి చెరువు కట్ట తెగడం వల్ల కాలనీలు ముంపునకు గురయ్యాయి.

పరిష్కారం: పోతననగర్ నాలాకు ఇరువైపులా గోడలు నిర్మించాలి. భద్రకాళి చెరువు కట్టను పటిష్ఠపరచాలి.

రఘునాథ్ కాలనీ, రామన్నపేట..

వరంగల్ బట్టల బజారు, గిర్మాజిపేట, పిన్నావారి వీధి నుంచి వరద నీరంతా రామన్నపేట పెద్ద మోరీ గుండా పోతననగర్ నాలాకు వెళ్తాయి. పెద్దమోరీ పనులు పూర్తి చేయకపోవడంతో రఘునాథ్ కాలనీలోకి వరద నీరు చేరింది. 12 మోరీలు, భద్రకాళి నాలాల వరదనీటితో రామన్నపేట బీసీ, ఎస్సీ కాలనీల్లోకి నీళ్లు వచ్చాయి. పెద్దమోరీకి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలి.

ఉర్సు డీకేనగర్..

40వ డివిజన్ ఉర్సు డీకేనగర్ ఉర్సు రంగసముద్రం చెరువు శిఖంలో ఉంది. నాయుడుపంపు, రంగశాయిపేట, శంభునిపేట, ఉర్సు ప్రాంతంలోని వరద నీరంతా డీకేనగర్ మీదుగా చెరువులోకి వెళ్లేలా కాలువలున్నాయి. వర్షాలకు వరద ఉద్ధృతి పెరుగుతుండటంతో నీటి ప్రవాహం కాలువపైకి వచ్చి వెనక్కి తన్ని డీకేనగర్‌లోకి వస్తోంది. ఇదే సమయంలో అటు కరీమాబాద్, నానమీయా తోట మీదుగా వచ్చే వరద కూడా చెరువులోకి కాలువ గుండా వెళ్లకుండా డీకేనగర్‌లోకి



రావడం వల్ల ఏటా ముంపునకు గురవుతోంది.

ఉర్సు చెరువులోకి పైనుంచి వచ్చే వరద నీరు సాఫీగా వెళ్లేలా కాలువను విస్తరించాలి. డీకేనగర్ వైపు నుంచి వెళ్లే నీరు ఆ కాలనీవైపు రాకుండా చర్యలు తీసుకోవాలి.

ఎన్టీఆర్ నగర్‌లో 70 కుటుంబాలు..

వరంగల్ త్రినగరాల్లోనే అత్యంత ముంపు ప్రాంతంగా ఎన్టీఆర్ నగర్ ఉంది. భద్రకాళి చెరువు కట్టను ఆనుకొని కాలనీ ఏర్పడింది. 1997లో దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న 70 కుటుంబాలకు పట్టాలు ఇచ్చారు. వర్షాలొస్తే బొందివాగు, భద్రకాళి నాలాల వరద ముంచుతుంది. దీంతో వర్షాకాలం ఇళ్లు ఖాళీ చేయాల్సిందే.

ఎన్టీఆర్‌నగర్ పక్క నుంచి కచ్చ నాలాను వరద నీటి కాలువగా అభివృద్ధి పరచాలి. ఇరువైపులా గోడలు నిర్మించాలి.

శివనగర్‌కు ముప్పు..

ఖిలావరంగల్ కోట చుట్టూ ఉన్న ఆగర్త నుంచి వచ్చే వరద నీరు నిల్వ ఉండాల్సిన కుంటలు కబ్జాలకు గురై నివాసాలు వెలిశాయి. పడమర కోట నుంచి వచ్చే వరదనీరు పారే శివనగర్‌లోని కాలువలు 80 అడుగుల విస్తీర్ణం నుంచి ఐదడుగులకు కుంచించుకుపోయాయి. కబ్జాలను తొలగించడానికి మార్కింగ్ చేసిన బల్దియా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడంతో ఏటా ముంపుతో స్థానికులు నష్టపోతున్నారు. శివనగర్‌ను ముంపు నుంచి కాపాడేందుకు చేపట్టిన డక్ట్ అండ్ డ్రైయిన్ నిర్మాణం పూర్తి కాలేదు. దీనికితోడు ప్రధాన కాలనీల వరదనీరు ఈ డ్రైయిన్‌లో కలిసేలా నిర్మాణం చేయకపోవడం వల్ల వరదనీరు వీధుల్లోకి వచ్చి ఇళ్లను ముంచింది.

కాలువ అక్రమణలు తొలగించాలి. కొత్తగా నిర్మాణం చేస్తున్న డక్ట్ అండ్ డ్రైయిన్‌కు కాలనీల నీరు వెళ్లేలా అనుసంధానం చేయాలి.

రిటైనింగ్ గోడ లేక..

భద్రకాళి చెరువు పోతననగర్ మత్తడి నుంచి కేఎంజీ పార్కు, సరస్వతి కాలనీ, భద్రకాళి రోడ్, రంగంపేట, ఎల్బీ కళాశాల, ములుగు రోడ్డు, అలంకార్ పెద్దమోరీ వరకు భద్రకాళి నాలా విస్తరించింది. 2020 అక్టోబరులో నాలాను విస్తరించిన అధికారులు వరద నీటి కాలువ, ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించక పోవడంతో ఏటా వరదల సమయంలో ఈ కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.

వరదనీటి కాలువ, రిటైనింగ్ గోడ నిర్మించాలి

బీఆర్‌నగర్ ముంపునకు కారణాలివే..

ఉర్సు రంగసముద్రం చెరువు మత్తడి పడితే ఆ నీరుతోపాటు, వర్షపు నీరు భట్టుపల్లి బైపాస్ కల్వర్టు కింద నుంచి బొందివాగు వైపు పారుతుంది. ఇదే కాలువలో భట్టుపల్లి, అమ్మవారిపేట పరిసర ప్రాంతాల్లోని వరదనీరు కాలువ కలిసి అక్కడి నుంచి బీఆర్‌నగర్, రాజీవ్‌నగర్. ఎన్ఎన్‌నగర్ పక్క నుంచి ప్రవహిస్తూ హంటర్‌రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఖమ్మం బైపాస్ కల్వర్టు నుంచి బొందివాగులో కలుస్తుంది. రెండు కాలువలు ఉద్ధృతంగా ప్రవహించడంతో వరద నీరు వెళ్లే కాలువ కబ్జాలకు గురై ఇరుకుగా మారి బీఆర్‌నగర్, ఎన్ఎన్‌నగర్, రాజీవ్‌నగర్ కాలనీలను ముంచింది. ఏటా వర్షాకాలంలో ఇక్కడి ప్రజలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు.

సాయినగర్, బృందావన్ కాలనీ..

హంటర్ రోడ్డు ప్రధాన రహదారిని ఆనుకొని సాయినగర్, బృందావన్ కాలనీలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 150 ఇళ్లు ఉంటాయి. ఈ కాలనీలను ఏటా బొందివాగు నాలా వరద నీరు ముంచెత్తుతున్నాయి. కాలనీల్లో డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేదు. వరదనీటి కాలువలు నిర్మించాలి.

# గణనీయంగా తగ్గిన విత్తన సాగు!

హుజూరాబాద్: ఉత్తర తెలంగాణలోనే విత్తనోత్పత్తికి అనుకూలమైన జిల్లాలో ఈ సారి విత్తన సాగు గణనీయంగా తగ్గిపోయింది.. గతేడాది సాగు చేసిన విత్తనాలకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం, నిల్వలన్నీ పేరుకుపోవడంతో కంపెనీలు విత్తన సాగు చేయించడానికి ముందుకు రాలేదు. ఫలితంగా ఆడ మగ వరితోపాటు లోకల్ సీడ్ కలిపి గతేడాది లక్షా 15వేల ఎకరాల్లో విత్తన సాగు చేస్తే ప్రస్తుత యాసంగిలో 40 శాతం తగ్గింది. దీంతో ప్రతీసారీ విత్తన సాగు చేసే రైతులు ఈసారి సాధారణ వరిసాగునే ఎంచుకుని నాట్లు వేశారు.

జిల్లాలో గతేడాది 70 వేల ఎకరాల్లో లోకల్ సీడ్ సాగయింది. సీడ్ ప్లాంట్ల యజమానులు 1010 వెరైటీ, కూనారం, జేజీఎల్ వెరైటీ సన్నాల ఫౌండేషన్ సీడ్ ఇచ్చి రైతులతో సాగు చేయించారు. ఇక్కడ పండించిన విత్తనాలకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో డిమాండ్ ఎక్కువగా ఉంది. అందుకే ఏటా అత్యధికంగా విత్తన సాగు అవుతోంది. కానీ ఒక్కసారిగా ఆయా రాష్ట్రాల్లో విత్తన అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. ఇక్కడి రైతులు కూడా కొనుగోలు చేయకుండా సొంతంగా క్షేత్రంలో పండించిన విత్తనాలనే నాటడంతో లోకల్ సీడ్‌కు డిమాండ్ తగ్గినట్లు తెలుస్తోంది. ఫలితంగా జిల్లాలోని 45 సీడ్ ప్లాంట్లలో 60వేల క్వింటాళ్ల విత్తన నిల్వలు పేరుకుపోయాయి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గడం, స్థానికంగా ఆశించిన మార్కెటింగ్ లేకపోవడంతో ప్రస్తుత యాసంగిలో సీడ్ ప్లాంట్ల యజమానులు 40 శాతం విత్తన సాగును తగ్గించినట్లు వ్యవసాయాధికారులు అంటున్నారు. అందువల్లే గతంలో కంటే ఈసారి జిల్లాలో 25 వేల ఎకరాల్లో లోకల్ సీడ్ సాగు తగ్గినట్లు చెబుతున్నారు.

హుజూరాబాద్ డివిజన్‌లో అత్యధికం : జిల్లాలో ఆడ, మగ వరి విత్తన సాగు హుజూరాబాద్ డివిజన్‌లోనే అత్యధికంగా ఉంది. పేరొందిన కంపెనీలు ప్రతీ యాసంగిలో ఇక్కడి రైతులకు ఫౌండేషన్ సీడ్ ఇచ్చి విత్తన సాగు చేయిస్తున్నారు. ఇక్కడ పండించిన విత్తనాలను దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తారు.



గతేడాది యాసంగిలో 45 వేల ఎకరాల్లో ఆడ మగ వరి విత్తన సాగు చేయగా వీణవంక, శంకరపట్నం, జమ్మికుంట, ఇల్లందకుంట, హుజూరాబాద్ మండలాల్లోనే 16 వేల ఎకరాల్లో సాగయింది. ఇందులో ఒక్క వీణవంక మండలంలోనే అత్యధికంగా 9 వేల ఎకరాల్లో పంట వేశారు. రైతులు పండించిన ఆడ మగ విత్తన ధాన్యాన్ని ఆయా కంపెనీలు కొనుగోలు చేశాయి. కానీ గతేడాది నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లో విత్తనాలకు కూడా డిమాండ్ తగ్గింది. ఫలితంగా విత్తన నిల్వలన్నీ పేరుకుపోవడంతో ఆయా కంపెనీలు ప్రస్తుత యాసంగిలో 30 శాతం విత్తన సాగును తగ్గించినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీనికితోడు పంట ఉత్పత్తి చేసిన తర్వాత ఆయా కంపెనీల డీలర్లు సకాలంలో డబ్బులు చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం, ఒప్పందం ప్రకారం ధర చెల్లించకుండా క్వింటాకు రూ.500 కోత విధిస్తున్నారు. ఈ విషయంలో కంపెనీల డీలర్లు, రైతులకు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. కొందరైతే విత్తనాలు కొనుగోలు చేసి రూ.లక్షలు ఎగ్గొట్టి రైతులకు శఠగోపం పెట్టిన సందర్భాలు ఉన్నాయి. దీంతో విసుగు చెందిన కొందరు రైతులు ఆడ మగ విత్తన సాగుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. వెరసి ప్రస్తుత యాసంగిలో 15వేల ఎకరాల్లో సాగు తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ మాట్లాడుతూ గతేడాది కంటే ప్రస్తుత యాసంగిలో 40 శాతం విత్తన సాగు తగ్గిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ఆయా కంపెనీలు ఆడ మగ వరి విత్తన సాగును ఈసారి తగ్గించాయని, ఇప్పటికే రైతులు సాధారణ వరి నారు పోయడంతో ఇక విత్తన సాగు పెరిగే అవకాశం లేదని చెప్పారు.

# ఉపాధి ఖరారు

కరీంనగర్: ఉన్న ఊళ్లో ఉపాధిని అందించే పథకం అమలు తీరులో జోరు కనిపిస్తోంది.. ఇప్పటికే పని కల్పనలో ఆదర్శంగా నిలుస్తున్న నాలుగు జిల్లాల్లో వచ్చే ఆర్థిక సంవత్సరం (2023-24)లో చేపట్టాల్సిన పనుల ఎంపిక, పనిదినాల ప్రక్రియ ఖరారైంది. ఇటీవల వరుసగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో చేపట్టిన తీర్మానాల ఆధారంగా లక్ష్యాన్ని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కూలీలకు ఈసారి 1,39,65,819 పని దినాలను అందించాలని భావించారు. ఆయా పంచాయతీలు వాటి పరిధిలోని అనుబంధ గ్రామాల్లో వస్తున్న కూలీల సంఖ్య ఆధారంగా చేయాల్సిన పనులను అంచనా వేశారు. ఇందుకు తగినట్లుగా ప్రణాళికను రూపొందించారు. వీటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. అవసరమైనవే గుర్తింపు.. : గతంలో మాదిరిగా ఇబ్బడిముబ్బడిగా పనుల సంఖ్య కాకుండా క్షేత్రస్థాయిలో అవసరమైనవాటినే చేపట్టేలా ఈ సారి మార్పుతో కూడిన కూర్పు కనిపించింది. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యాన్ని చూపించారు. వాస్తవంగా చేపట్టాల్సిన పనులనే ఎంచుకున్నారు. మరోవైపు చిన్నాచితకా కాకుండా శాశ్వత ప్రయోజనాన్ని కలిగించే వాటిపై దృష్టి సారించారు. కూలీలకు ఉపాధి దొరకడంతోపాటు సామగ్రి వినియోగం విషయంలో జిల్లాల వారీగా సరైన అంచనాలను రూపొందించారు. గత వార్షిక సంవత్సరంతో పోలిస్తే వచ్చే ఏడాది చేపట్టే పనిదినాల సంఖ్య 7,26,952కు తగ్గడం గమనార్హం. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధం గా ఉన్న వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. పంట పొలాలకు అనుసంధానంగా రోడ్లు వేయడంతోపాటు ఉపరితల నీటి నిల్వ ట్యాంకులు, భూ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు మొగ్గు చూపారు. హరితహారంలో గుంతల తవ్వకంతోపాటు కంచెల ఏర్పాటు లాంటి వాటిని ప్రణాళికలో భాగం చేశారు. మరోవైపు గతానికి భిన్నంగా పర్యవేక్షణ చేపట్టేలా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

# పట్టా రాని ఆవేదన..!



వరంగల్ :కేసముద్రం మండలం నారాయణపురంలో పట్టాల కోసం ధరణిలో దరఖాస్తు చేసుకున్న కొంత మంది రైతులకు సంబంధించి కారణాలేమీ తెలపకుండానే తిరస్కరణకు గురవుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం అందరికీ పట్టాలు వస్తాయనేది చెబుతున్నారు.. తిరస్కరణకు సంబంధించి సరైన సమాధానం చెప్పడం లేదు. కారణాలు తెలపకపోవడంతో మళ్లీ తమ వద్ద ఉన్న పత్రాలతోనే మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారా..?లేదా..? అనేది తెలుసుకునేందుకు మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. నాలుగు, ఐదుసార్లు దరఖాస్తు చేసిన రైతులున్నారు. తిరస్కరిస్తున్నా కారణాలు మాత్రం చెప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

200 మంది ఆందోళన

ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం గుర్తించిన వ్యవసాయ భూమిలో కాస్తులో ఉన్న రైతులందరికీ పట్టాలందించేందుకు అధికారులు టీఎం-33 కింద ధరణిలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో అన్నదాతలు పాత పట్టాపుస్తకాలు, పహణీలు, సాదాబైనామా పత్రాలతో దరఖాస్తులు సమర్పించారు. ఇప్పటి వరకు 600 ఎకరాలకు సంబంధించి 280 మంది రైతులకు పట్టాలు అందించారు. మరో 200 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా 200 మంది మాత్రం పట్టాలు అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. అధికారులు అడిగినట్లుగా తమ వద్ద ఉన్న ఆధారాలతోనే దరఖాస్తు ఇచ్చినా కారణం చెప్పకుండానే తిరస్కరిస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మళ్లీ దరఖాస్తు చేయాల్సి వస్తోందన్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ. వెయ్యి వరకు వ్యయమవుతుందన్నారు. ఈ సమస్యే కాకుండా టీఎం-33లో పేర్లు ఉన్నా పాసుపుస్తకాలు రావడం లేదు. సుమారు 50 మంది రైతుల వేలిముద్రలు పడడం లేదు. లింక్ డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ తిరస్కరణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తిరస్కరణకు గల కారణాలు తెలిపి అందరికీ పట్టాలు అందించి ప్రభుత్వ పథకాలకు అర్హులను చేయాలంటూ నారాయణపురం రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేలిముద్ర తీసుకోవడం లేదు

బానోతు వెంకన్న, రైతు

సర్వే నంబరు 154/ఎఫ్/1లో 2.08 ఎకరాల భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకం కోసం మీసేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నా. ధరణిలో పేరు కనిపిస్తుంది. వేలిముద్ర తీసుకోవడం లేదు. మూడు నెలల నుంచి వారానికి ఒకసారి సంబంధిత కార్యాలయానికి వెళ్లి వస్తున్నా. సమస్యను పరిష్కరించి పట్టా అందించాలి.

ఐదు సార్లు దరఖాస్తు చేశా

గుగులోతు వినోద, రైతు

ఎంజాయ్‌మెంట్ సర్వేలో మా భూములున్నాయి. సర్వేనంబరు 165/63లో 6.08 ఎకరాల భూమి ఉంది. టీఎం-33లో సాదాబైనామా పత్రాలతో దరఖాస్తు చేసుకున్నా. అధికారులు కారణం తెలపకుండానే తిరస్కరించారు. ఇప్పటి వరకు ఐదు సార్లు దరఖాస్తు చేశాను. మా ఊరిలో సాదాబైనామతో దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు ఇచ్చారు. అదే విధానంలో మాకు అందించాలి.

అర్హులందరికీ పట్టాలు అందిస్తాం

ఫరీద్, తహసీల్దార్, కేసముద్రంరైతులు ఆందోళన చెందనవసరం లేదు. అర్హులైన వారందరికీ పట్టాలు ఇస్తాం. పాత పట్టాదారు పాసుపుస్తకాలు, పహణీలో ఉన్న రైతులకు మొదట ప్రాధాన్యతగా 600 ఎకరాలకు సంబంధించి పట్టాలు అందిం చాం. సాంకేతిక సమస్యల కారణంగా 200 ఎకరాల దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే వారికి కూడా అందిస్తాం. కొంత అలస్యమైనప్పటికీ మిగిలిన రైతులకు సాదాబైనామా ద్వారా పట్టాలు ఇస్తాం.

# వైద్య కళాశాల ప్రారంభానికి వేగంగా అడుగులు !




జనగామ : జనగామలో వచ్చే ఏడాది వైద్య కళాశాలను ప్రారంభించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. వైద్య కళాశాల మంజూరు కావడంతో ఇప్పటికే కళాశాల భవన నిర్మాణానికి 18 ఎకరాల స్థలం కేటాయించారు. కళాశాల ఏర్పాటుతో గతంలో వైద్యవిధాన పరిషత్‌లో ఉన్న జిల్లా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రులు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి చేరాయి. ఈ ఆసుపత్రులు ఇక నుంచి వైద్య కళాశాలకు అనుబంధంగా పని చేయనున్నాయి. వచ్చే ఏడాదిలో వైద్య కళాశాలను ప్రారంభించేందుకు డీఎంఈ అధికారులు చర్యలు చేపట్టారు.

మారిన వైద్యశాఖ ముఖచిత్రం

జిల్లా కేంద్రంలో ఇప్పటికే జిల్లా ప్రధాన ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి ఉన్నాయి. వైద్య కళాశాల రాకతో ఇటీవలే ఆసుపత్రి స్థాయి పెరిగి డీఎంఈ పరిధిలోకి రావడంతో 'ప్రభుత్వ వైద్య కళాశాల/జనరల్ ఆసుపత్రి'గా పేరు పెట్టారు. ఇటీవలే వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ గోపాల్‌రావు విధుల్లో చేరారు. ఈయనకు జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక ఛాంబర్ కేటాయించారు. వైద్య కళాశాల ప్రారంభం తర్వాత విద్యార్థులకు కళాశాలలో చదువుతో పాటు జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రిలో విభాగాల వారీగా ప్రొఫెసర్ స్థాయి వైద్యులు సేవలందించనున్నారు. ఇక్కడ గతంలో ఏరియా ఆసుపత్రి స్థాయిలో ఉన్న 100 పడకల ఆసుపత్రిని పాలకుర్తి, లేదా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసేందుకు వైద్యవిధాన పరిషత్ అధికారులు యోచిస్తున్నారు.

భవనాల పరిశీలన

వచ్చే ఏడాదిలో వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఎన్ఎంసీ బృంద సభ్యులు తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి సమయం పట్టే అవకాశం ఉన్నందున వచ్చే ఏడాది 100 మంది విద్యార్థులతో మొదటి బ్యాచ్ ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాన్ని పరిశీలించే పనిలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. తొలుత ధర్మకంచ ప్రాంతంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని కలెక్టర్ శివలింగయ్య నేతృత్వంలో అధికారులు పరిశీలించారు. ఎన్ఎంసీ బృంద సభ్యుల తనిఖీలో.. ఎంసీహెచ్‌తో పాటు జిల్లా ఆసుపత్రిలోనే పై అంతస్తుల్లో కళాశాల కోసం భవన సముదాయాలు నిర్మిస్తే బాగుంటుందనే యోచన చేసినట్లు తెలుస్తోంది. ఎంసీహెచ్ ఆసుపత్రిలో పేయింగ్ గదులు ఐదు, మరో సమావేశ మందిరాన్ని తరగతుల కోసం కేటాయిస్తే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఎంసీహెచ్ పక్కన కేటాయించిన ఐదెకరాల స్థలంలో జిల్లా ఆసుపత్రికి అనుసంధానంగా మరో 100 పడకల ఆసుపత్రి, 50 పడకలతో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు నిధులు మంజూరైన విషయం విదితమే.

ఎన్ఎంసీ బృందం సందర్శన

ప్రభుత్వ వైద్య కళాశాల/జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రుల్లో ఉన్న సౌకర్యాలు, వసతులను బుధవారం నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) బృందం సభ్యులు సందర్శించారు. అన్ని విభాగాల వైద్యుల ధ్రువపత్రాలు, వారి రిజిస్ట్రేషన్ అనుమతుల వివరాలను పరిశీలించారు. ఈ బృంద సభ్యులు ఇచ్చే నివేదికనే కళాశాల ప్రారంభానికి కీలకంగా మారనుందని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

ఏర్పాట్లు చేస్తున్నాం..డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, జనరల్ ఆసుపత్రి

జనగామలో వైద్య కళాశాల మొదటి బ్యాచ్ తరగతులు వచ్చే ఏడాది ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఎంసీహెచ్‌లో తాత్కాలికంగా కళాశాల తరగతులు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తున్నాం. మరో చోట తాత్కాలిక భవనం కోసం ప్రయత్నిస్తున్నాం.

# గంజాయి గుప్పు.. గుట్టుగా గుట్కా!

చేగుంట : గత నెల మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని ఓ కిరాణ దుకాణంలో గంజాయితో తయారు చేసిన చాక్లెట్లను అమ్మారు. ఈ సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 33 కిలోలు స్వాధీనం చేసుకుని నిర్వాహకురాలిని అరెస్ట్ చేశారు. మెదక్ శివారు ఔరంగాబాద్ రోడ్డువద్ద 70 చాక్లెట్లు డిసెంబరు 13వ తేదీన పట్టుబడ్డాయి. అలాగే మహారాష్ట్ర నుంచి గంజాయి సిగరెట్లను తీసుకొచ్చి సరఫరా చేస్తున్న మెదక్‌కు చెందిన ఇద్దరిని అరెస్ట్‌చేశారు. గత నవంబరులో రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరి వ్యక్తుల నుంచి 252 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.నర్సాపూర్‌లో ఆబ్కారీ అధికారులు దాడులు చేసి వెయ్యి గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు.

జిల్లాలో నిషేధిత గంజాయి, గుట్కాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతాల్లో గంజాయిని చాక్లెట్ల రూపంలో గుట్టుచప్పుడుకాకుండా అమ్ముతున్నారు. కొన్ని చోట్ల సిగరెట్లలో నింపి విక్రయిస్తున్నారు. చేగుంట, మనోహరాబాద్, చిన్నశంకరంపేట, తూప్రాన్, శివ్వంపేట తదితర మండలాల్లో పరిశ్రమలున్నాయి. వీటిలో ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేల సంఖ్యలో పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది గంజాయిలాంటి మత్తు పదార్థాలను వాడుతున్నారు. వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొందరు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారు. వివిధ రూపాల్లో ఇక్కడికి తీసుకొచ్చి ప్యాకెట్లుగా తయారు చేసి పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో, హొటళ్లు, పాన్ దుకాణాల్లో రహస్యంగా అమ్ముతున్నట్లు సమాచారం. ఇటీవల చేగుంటలో ఇద్దరు వ్యక్తులు గంజాయిని వినియోగించి గాంధీ చౌరస్తా వద్ద పడిపోయారు. ఆబ్కారీ, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# పాఠశాలల్లో స్వచ్ఛత ఏది?

సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణం పాత బస్టాండ్ సమీపంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వెయ్యి మందికిపైగా విద్యార్థినులు చదువుతున్నారు. ఇక్కడి పరిసరాలు, భవనాలపై పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. అప్పుడప్పుడు పాములు సంచరిస్తున్నాయి. పురపాలక అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అందోలు మండలం పోసానిపేట ప్రాథమిక పాఠశాల ముందు పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు పేరుకుపోయాయి. అపరిశుభ్రత మధ్యే విద్యార్థులు చదువుకుంటున్నారు. కంది మండలం ఇంద్రకరణ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోనూ చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులకు తెలిపినా.. పెద్దగా స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇది మూడు పాఠశాలల సమస్య మాత్రమే కాదు.. జిల్లాలోని దాదాపు అన్ని బడుల్లోనూ పరిశుభ్రత కరవైంది. గతంలో పారిశుద్ధ్య కార్మికులు బడుల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టేవారు. విద్యాశాఖ వీరిని తొలగించి ఈ బాధ్యతను పట్టణాల్లో పురపాలికలు, గ్రామాల్లో పంచాయతీలకు అప్పగించింది. అక్కడి సిబ్బందికి పట్టణాలు, గ్రామాల్లోనే పారిశుద్ధ్య చర్యలకు సమయం సరిపోతుంది. దీంతో పాఠశాలలను శుభ్రం చేయకపోవడంతో అధ్వాన పరిస్థితుల మధ్యే విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గతేడాది సిబ్బంది తొలగింపు

పాఠశాలల్లో పని చేసే స్కావెంజర్ల(పారిశుద్ధ్య కార్మికులు)ను ప్రభుత్వం గతేడాది తొలగించింది. వాటిలో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతను పురపాలికలు, పంచాయతీలకు అప్పగించింది. ఈ ఏడాది జూన్‌లో



బడులు ప్రారంభమైనప్పుడు నామమాత్రంగా శుభ్రం చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ ఏడాది పురపాలికలు, పంచాయతీలకే అప్పగించారు. జిల్లాలో 1247 ప్రభుత్వ పాఠశాలల్లో 1.23 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. తమ పాఠశాలలు శుభ్రం చేయాలని పురపాలక కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఇదేమని అడిగితే పట్టణాల్లో, పంచాయతీల్లో పారిశుధ్య పనులకే సిబ్బంది సరిపోవడం లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు, కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకుంటే పాఠశాలల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తదు. గతంలో పాలనాధికారి సమీక్ష నిర్వహించి ఆదేశించినా ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు.

ఆదేశాలు పాటించాలి: రాజేశ్, జిల్లా విద్యాధికారి

పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతను పురపాలికలు, పంచాయతీలకు అప్పగించారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించి.. పాఠశాలలు శుభ్రం చేయించుకోవాలి. విద్యాశాఖ తరఫున కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారికి సమస్యను నివేదిస్తాం. సాధ్యమైనంత వరకు శుభ్రం చేయించేలా చూడాలని విన్నవిస్తాం.


# ఉపాధి కార్యాచరణకు గ్రామసభలు

సంగారెడ్డి : పల్లె ప్రజలకు ఉపాధి కల్పించి వలసలను నిరోధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి పనులు చేపడుతున్నారు. వచ్చే ఏడాదికి సంబం ధించి ఇప్పటికే ఊరూరా గ్రామ సభలు నిర్వహించి పలు రకాల పనులు గుర్తించిన నేపథ్యంలో కథనం.జల సంరక్షణకు ప్రాధాన్యం

జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉండగా.. 639 పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం అమలవుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన 56 రకాల పనులను ఎంపిక చేయడానికి తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలి. లేదంటే నిధులు మంజూరు కావు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాదికి సంబంధించిన పనుల ఎంపికకు గత ఏడాది అక్టోబరు 2 నుంచి డిసెంబరు 31 వరకు గ్రామసభలు నిర్వహించారు. ఆయా పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వచ్చే ఏడాది 57,42,177 పని దినాలు కూలీలకు కల్పించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రణాళిక రూపొందించింది. ప్రధానంగా 2548 నీటి సంరక్షణ పనులకు పెద్దపీట వేశారు.

సమన్వయంతోనే సత్ఫలితం

జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికి పని కల్పించడంలో పంచాయతీ కార్యదర్శి,



క్షేత్ర సహాయకులది కీలకపాత్ర. ఏపీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలూ.. సమన్వయంతో పని చేయిస్తేనే ఫలితం ఉంటుంది. 639 గ్రామ పంచాయతీలకు కేవలం 332 మంది మాత్రమే క్షేత్ర సహాయకులు ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూలీల జాబ్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం చేయాలనే నిబంధన ఉంది. ఈ దిశగా అధికారులు అవగాహన కల్పించాలి.

ఎక్కడైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయాలి

సీహెచ్ శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీవో

జిల్లాలో వచ్చే ఏడాదికి పనుల గుర్తింపునకు గ్రామ సభలు ఇటీవల పూర్తి చేశాం. ప్రజల సమక్షంలో ప్రణాళికలు తయారు చేశాం. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆసక్తి ఉన్న కూలీలందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా పనుల కల్పనలో సమస్యలుంటే ఫిర్యాదు చేయాలి. క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేస్తాం.




# కొడాలి నాని వ్యాఖ్యలపై చిరంజీవి అభిమానుల నిరసన.. ఉద్రిక్తత

గుడివాడ రూరల్: కృష్ణా జిల్లా గుడివాడలో అగ్ర కథానాయకుడు చిరంజీవి అభిమానులు బుధవారం ఆందోళనకు దిగారు. చిరంజీవిపై మాజీ మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అభిమానులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 'జై చిరంజీవ.. కొడాలి నాని డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేశారు. కొడాలి నాని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో చిరంజీవి అభిమానులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. చిరంజీవి యువత అధ్యక్షుడు కందుల రవి, పలువురు అభిమానులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసు వాహనాలకు అడ్డంగా చిరంజీవి అభిమానులు పడుకుని నిరసన తెలిపారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పెద్ద ఎత్తున వచ్చిన అభిమానులను పోలీసులు నియంత్రించలేకపోయారు. అనంతరం పట్టణంలోని ఏజీకే స్కూల్ సెంటర్లో విజయవాడ మెయిన్‌రోడ్డుపై చిరంజీవి అభిమానులు బైఠాయించారు. వంగవీటి మోహనరంగా విగ్రహానికి క్షీరాభిషేకాలు చేశారు. చిరంజీవి, రంగా అభిమానుల ఓట్లతో గెలిచిన కొడాలి నానీకి 2024 ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

**ఏం జరిగిందంటే..** ఏపీ ప్రభుత్వ పెద్దలపై అగ్ర కథానాయకుడు చిరంజీవి పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేకెత్తించాయి. ఆయన వ్యాఖ్యలపై కొడాలి నాని మంగళవారం మచిలీపట్నంలో స్పందించారు.

'సినిమా పరిశ్రమలోని పకోడిగాళ్లు ప్రభుత్వం ఎలా ఉండాలో సలహాలు ఇస్తున్నారంటూ' ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఎలా ఉండాలనే సలహాలు ఇస్తున్నవారు.. నటులు పరిశ్రమకే సేవలందిస్తూ సినిమాలు, ఫైట్స్, డ్యాన్స్‌లు చేసుకోవాలంటూ వారికి కూడా సలహా ఇస్తే మేలని అన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో చిరంజీవి అభిమానులు గుడివాడలో ఆందోళనకు దిగారు.

# లైఫ్‌లైన్ ప్రాజెక్టుకు లైఫే లేకుండా చేశారు: నారా లోకేశ్ ట్వీట్

అమరావతి: బ్రిటిష్ పాలన కంటే ఘోరమైన పాలన ఏపీలో సాగుతోందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా ఆయన ట్వీట్ చేశారు. "భారతదేశ స్వాతంత్ర్య సమర నినాదం క్విట్ ఇండియా. 1942 ఇదే రోజున క్విట్ ఇండియా అని నినదిస్తే బ్రిటిష్ వాళ్లు ప్రజలను జైళ్లలో పెట్టేవారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్రిటిష్ వాళ్లకు మించిన పాలన జరుగుతోంది. ఇప్పుడు మన జన నినాదం 'క్విట్ సైకో జగన్ – సేవ్ ఏపీ" అని లోకేశ్ పేర్కొన్నారు.

మరోవైపు రాష్ట్రానికి లైఫ్‌లైన్ ప్రాజెక్ట్ అయిన పోలవరానికి సీఎం జగన్ లైఫే లేకుండా చేశారని లోకేశ్ విమర్శించారు. జగన్ పాలనలో పాత ప్రాజెక్టుల విధ్వంసం తప్ప కొత్తగా ఒక్క ప్రాజెక్టునూ నిర్మించలేదని ఆక్షేపించారు. వైకాపా ప్రభుత్వం తీరుతో వ్యవసాయ



రంగం సంక్షోభంలో పడిందని విమర్శించారు. నవ్యాంధ్ర జీవనాడి పోలవరం ప్రశ్నార్థకమైందని లోకేశ్ దుయ్యబట్టారు.

# గిరిపుత్రుల సంక్షేమానికి పెద్దపీట

## ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం వైయస్ జగన్ శుభాకాంక్షలు



తాడేపల్లి: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం సీఎం వైయస్ జగన్ ట్వీట్ చేశారు. ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందుతున్నా గిరిపుత్రులు మాత్రం అమ్మలా భావిస్తున్న అడవులపైనే ఆధారపడి జీవిస్తూ.. నిత్యం ప్రకృతిని కాపాడుతున్నారు. వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మన ప్రభుత్వంలో వివిధ కార్యక్రమాలను ప్రవేశపెట్టాం. నాణ్యమైన విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పిస్తూనే లక్షల మంది గిరిజనులకు పోడు భూములపై యాజమాన్య హక్కులు కల్పించాం. గిరిజనులకు ప్రాధాన్యత ఇచ్చి, కొత్తగా రెండు జిల్లాలను ఏర్పాటు చేశాం. నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వారికి నా శుభాకాంక్షలు.


# నారా లోకేష్‌కు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సవాల్



పల్నాడు జిల్లా: వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధిపై మంగళగిరి టీడీపీ ఆఫీసులో చర్చ పెట్టినా తాను చర్చకు సిద్ధమని నారా లోకేష్‌కు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నేను అబద్ధాలు చెప్పినట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. గురజాల నియోజకవర్గంలో టీడీపీ చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలి" అని డిమాండ్ చేశారు. "రూ.83 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, అంగన్‌వాడీలు, కమ్యూనిటీ హాళ్లని రూ.2020 కోట్లతో నిర్మించానని లోకేష్ అబద్ధాలు చెప్పాడు. సారా డబ్బులతో హైదరాబాద్‌లో చంద్రబాబుకు రూ.300 కోట్ల భవనం. ప్రజల్ని లూటీ చేసి చంద్రబాబు, లోకేష్ సంపాదించారు. టీడీపీ హయాంలో లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి సర్వే అయినా చేయించారా?" అంటూ మహేష్‌రెడ్డి ప్రశ్నించారు.

# ఎవరిపై కేసు పెట్టాలనే విచక్షణ ఈ ప్రభుత్వానికి లేదు

విజయనగరం: చిత్తూరు జిల్లా అంగళ్లులో జరిగిన ఘటనకు సంబంధించి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై ఏ1గా కేసు నమోదు చేయడంపై టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరిపైన కేసులు పెట్టాలి.. ఎవరిపైన పెట్టకూడదు అనే విచక్షణ ఈ ప్రభుత్వానికి లేదని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వానికి నచ్చకపోతే కేసులు పెడుతున్నారన్నారు. నాలుగున్నర కాలంలో టీడీపీపై అనేక కేసులు పెట్టారన్నారు. అభివృద్ధి మాత్రం లేదని.. పేపర్ ప్రకటనలు మాత్రం ఇస్తున్నారని తెలిపారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. భయాందోళనకు గురి చేయాలని చూడటం దారుణమన్నారు. చంద్రబాబుకు సెక్యూరిటీ తీసేస్తే చంపేస్తామని స్పీకర్ మాట్లాడడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై ఎలాంటి కేసులు పెట్టడం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో మంత్రులు తమ పని తాము చేయడం లేదన్నారు. రాజ్యాంగంపై గౌరవం లేకుండా చేస్తున్నారని అన్నారు. డీజీపీ పదే



పదే చేతులు కట్టుకొని హైకోర్టు ముందు నిల్చోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ ఎప్పుడు బెదిరింపులుకు లొంగదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని కేసులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయన్నారు. ప్రవర్తన, భాష మార్చుకోవాల్సిన అవసరం ఉందని హితవుపలికారు. ప్రతిపక్ష నాయకుడికి భద్రత లేకుండా తిరగకుండా చేయడం ఎక్కడా లేదన్నారు. చంద్రబాబు మీద రాళ్లు వేసిన ఒక్కరిపైన అయినా కేసు నమోదు చేశారా అని అశోక్‌గజపతిరాజు ప్రశ్నించారు.

## విజయనగరంలోనే ఉంటాం.. దమ్ముంటే వచ్చి అరెస్టు చేసుకోండి: ఎమ్మెల్సీ భూమిరెడ్డి సవాల్

విజయనగరం: రాష్ట్ర పోలీసుల తీరు చాలా దారుణంగా ఉందని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి విమర్శించారు. అంగళ్లు ఘర్షణ ఘటనలో తెదేపా అధినేత చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. చంద్రబాబు ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా విజయనగరంలో ఉన్న భూమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సహా తామంతా విజయనగరంలోనే ఉన్నామని.. దమ్ముంటే వచ్చి అరెస్టు చేసుకోవాలని సవాల్ విసిరారు. "ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక తేవాలని చంద్రబాబు పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో వైకాపా వాళ్లే దాడులు చేస్తున్నారు. కేసులు మాత్రం మాపై పెడతున్నారు. ఆ దాడులకు పోలీసులే సాక్ష్యం. వారికి కూడా దెబ్బలు తగిలాయి. అక్రమ కేసులకు భయపడేది లేదు. ప్రజల కోసం జైలుకెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నాం. కేసులు న్యాయపరంగానే ఎదుర్కొంటాం " అని భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి చెప్పారు.



# సీఎం వైయస్ జగన్‌ను కలిసిన టీటీడీ నూతన చైర్మన్ భూమన

తాడేపల్లి: టీటీడీ నూతన ఛైర్మన్ గా నియమితులైన ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన సీఎం వైయస్ జగన్‌కు భూమన కరుణాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రేపు ఉదయం తిరుమలలో టీటీడీ చైర్మన్ గా భూమన కరుణాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. సీఎంని కలిసిన వారిలో భూమన తనయుడు భూమన అభినయ్ రెడ్డి ఉన్నారు.




భారత్‌లోని రక్షణశాఖ వెబ్‌సైట్లు, కంప్యూటర్లపై సైబర్ దాడులు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ శాఖ కీలక నిర్ణయం తీసుకొంది. ఇంటర్నెట్‌తో కనెక్ట్ అయిన తమ శాఖలోని కంప్యూటర్లలో మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను.. దేశీయంగా అభివృద్ధి చేసిన 'మాయ' ఓఎస్‌తో భర్తీ చేయనుంది. 'మాయ'ను ఓపెన్ సోర్స్ ఉబంటు ఆధారంగా రూపొందించారు. "మాయ ఇంటర్‌ఫేస్, పనితీరు పూర్తిగా విండోస్‌ను పోలి ఉంటుంది. కొత్త ఆపరేటింగ్ సిస్టమ్‌లోకి మారినా.. పెద్దగా సమస్యలేమీ ఉండవు. ఆగస్టు 15 నాటికి సౌత్ బ్లాక్‌లో ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న కంప్యూటర్లలో దీనిని ఇన్‌స్టాల్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు" అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఓ అధికారి పేర్కొన్నారు. దీంతోపాటు ఎండ్‌పాయింట్ డిటెక్షన్, ప్రొటెక్షన్ వ్యవస్థ 'చక్ర వ్యూహ'ను కూడా ఇన్‌స్టాల్ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రక్షణశాఖలో ఇంటర్నెట్, త్రివిధ దళాల నెట్‌వర్క్‌తో అనుసంధానించని కంప్యూటర్లలో మాత్రమే మాయ ఓఎస్‌ను వాడుతున్నారు. త్వరలోనే త్రివిధ దళాలకు చెందిన నెట్‌వర్క్ వ్యవస్థల్లో ఈ ఓఎస్‌ను వినియోగించే అవకాశం ఉంది.

ఇప్పటికే నౌకాదళం దీనికి సంబంధించిన అనుమతులు మంజూరు చేసింది. సైన్యం, వాయుసేన మాత్రం మాయ పనితీరును అంచనావేస్తున్నాయి. మాయా ఓఎస్‌ను ప్రభుత్వ రంగ ఏజెన్సీలు ఆరునెలల వ్యవధిలో అభివృద్ధి చేశాయి. ఈ ఓఎస్ మాల్‌వేర్ సహా పలురకాల సైబర్ దాడులను కట్టడి చేస్తుంది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా కీలక వ్యవస్థలపై పలు మార్లు మాల్‌వేర్, రాన్సమ్‌వేర్ దాడులు జరిగాయి. దీంతో మైక్రోసాఫ్ట్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను దేశీయంగా అభివృద్ధి చేసిన ఓఎస్‌తో మార్చాలని నిర్ణయించారు.




# సహచర ఎంపీపై సహనం కోల్పోయిన కేంద్రమంత్రి

దిల్లీ: అవిశ్వాస తీర్మానంపై చర్చలో భాగంగా లోక్‌సభలో కేంద్రమంత్రి నారాయణ రాణె వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. మంగళవారం శివసేన(యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ సహనం కోల్పోయారు. దీంతో ఆయన ప్రవర్తనను విపక్ష పార్టీలు తప్పుపట్టాయి. ప్రధానిమంత్రిపై వ్యాఖ్యలు చేసే స్థాయి సావంత్‌కు లేదంటూ దిగువ సభలో నారయణ రాణె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సావంత్.. మీరు కూర్చోండి. ప్రధాన మంత్రి మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాపై వ్యాఖ్యలు చేసే స్థాయి మీకు లేదు. ఒకవేళ మీరు మాట్లాడితే.. దాని పరిణామాలు ఎదుర్కొంటారు' అని హెచ్చరికలు చేశారు. దాంతో లోక్‌సభ స్పీకర్ ఆయన్ను మందలించాల్సి వచ్చింది. సరైన పదజాలం వాడండి అంటూ సూచించారు. రాణె ప్రవర్తనపై విపక్షాల నుంచి విమర్శలు వ్యక్తం అయ్యాయి. 'ఒక రౌడీలా ఆయన పార్లమెంట్‌లో బెదిరింపులకు దిగారు. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే విపక్ష సభ్యులను వెంటనే సభ నుంచి సస్పెండ్ చేస్తారు. ఇలాంటి అనుచిత భాష ఉపయోగించిన భాజపా మంత్రిని సస్పెండ్ చేస్తారా..?' అని ఆమ్‌ఆద్మీపార్టీ ప్రశ్నించింది. మంత్రి తన మాటలతో ఈ ప్రభుత్వ ప్రమాణాలను చూపిస్తున్నారంటూ శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంకా చతుర్వేది మండిపడ్డారు.

# అందుకే.. శరద్ పవార్ ప్రధాని కాలేదు: మోదీ

దిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ గతంలో ప్రధాని కాకపోవడానికి కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలే కారణమని ప్రధాని మోదీ ఆరోపించారు. మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన ఎన్డీయే కూటమి ఎంపీలతో జరిగిన సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. "కాంగ్రెస్ తమ స్వార్థ ప్రయోజనాల కోసమే నడుస్తోంది. ప్రతిపక్షంలో ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నారు. కానీ, ఆ పార్టీ వారసత్వ రాజకీయాల కారణంగా వారిని ప్రోత్సహించలేదు.

దీనివల్ల శరద్ పవార్, ప్రణబ్ ముఖర్జీ వంటి అత్యంత సమర్థులకు ప్రధాని అయ్యే అవకాశం లభించలేదు"అని అన్నారు. ఎన్డీయే కూటమిలో ఉన్న మిత్రపక్షాలే తమకు ముఖ్యమని.. సమష్టిగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. అందువల్లే తమకు ఎంతో గౌరవం లభిస్తోందని ప్రధాని ఉద్ఘాటించారు. కాంగ్రెస్‌లా భాజపాకు అహంకారం లేదన్నారు. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఇతరుల కంటే భిన్నంగా ఉంటానని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతో మాట్లాడిన విషయాలను ఈ సందర్భంగా మోదీ గుర్తు చేసుకున్నారు.

**'క్విట్ ఇండియా' స్ఫూర్తిని పొందండి** : అవినీతి, రాజవంశ రాజకీయాల నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు కృషి చేసిన 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలని ఎంపీలకు మోదీ పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేతలు సామాజిక న్యాయం గురించి మాట్లాడతారని.. కానీ, వారి కుటుంబ, బుజ్జగింపు, అవినీతి రాజకీయాలే దేశానికి ప్రమాదకరమని అన్నారు. దేశంలో వీటిని



రూపుమాపాలని ప్రధాని సూచించారు. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తాను ఎప్పుడూ భయపడలేదని మోదీ తెలిపారు. కొన్ని సందర్భాల్లో అలాంటి వారిని పదవి నుంచి తొలగించడం.. టిక్కెటు ఇచ్చేందుకు కూడా నిరాకరించినట్లు వెల్లడించారు. "రాజస్థాన్‌లో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారింది. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు భాజపా కచ్చితంగా అధికారంలోకి రావాలి. అందుకోసం పార్టీ నాయకులంతా ఐకమత్యంగా ఉండాలి"అని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు భాజపా గట్టి ప్రయత్నం చేస్తోంది. గత రెండు వారాలుగా పార్టీ నేతలతో ప్రధాని సమావేశం అవుతున్నారు.

# 'షేమ్ ఆన్ యూ జగన్ రెడ్డీ'.. ప్రతిచర్య ఉంటుంది గుర్తుంచుకో..

అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిపై కేసు నమోదు చేయడం పట్ల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. "షేమ్ ఆన్ యూ జగన్ రెడ్డీ" .. తప్పుడు కేసులతో తెలుగుదేశం పార్టీని అడ్డుకోలేవ్ అని అన్నారు. నేటి ప్రతీ చర్యకూ రేపు ప్రతిచర్య ఉంటుందని గుర్తుంచుకో అంటూ హెచ్చరించారు. నేడు టీడీపీ కార్యకర్త చిందించిన ప్రతి రక్తపు బొట్టుకూ రేపు సమాధానం చెప్తామన్నారు. పుంగనూరు, అంగళ్లులో దాడులకు ఉసిగొల్పింది జగన్ రెడ్డే అని ఆరోపించారు. చంద్రబాబుపై కేసు నమోదు జగన్ రెడ్డి పిరికితనానికి నిదర్శనమన్నారు.ర సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరితో జగన్ రెడ్డి వెన్నులో వణుకు మొదలైందన్నారు. చంద్రబాబు ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. రోడ్ షోలకు వస్తున్న జనాదరణ చూసి ఫ్రస్ట్రేషన్.. జగన్ రెడ్డి పిల్ల చేష్టలు నవ్వు తెప్పిస్తున్నాయన్నారు. తెలుగుదేశం



పార్టీ పర్యటన రూట్‌లో వైసీపీ కార్యకర్తలకు ఏం పని అని ప్రశ్నించారు. వైసీపీ ర్యాలీలు, ధర్నాలకు అధికారులు ఎలా అనుమతిస్తున్నారని నిలదీశారు. దాడులు చేసిన వారిని వదిలేసి, బాధితులపై కేసులు పెట్టడం జగ్లక్ రెడ్డికే చెల్లిందని అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేశారు.

# ఎన్టీఆర్ తర్వాత జాన్వీకపూర్ హీరో అతనే!

అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ 'దేవర' సినిమాతో టాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో అమ్మడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటిస్తోంది. ఈ అవకాశం పట్ల జాన్వీ ఎప్పుడూ ఎక్కడా ఓపెన్ అవ్వలేదు. కేవలం తెలుగు సినిమా చేస్తుందనే ప్రచారం తప్ప! ఆ సినిమా ఎంత ఇష్టపడి చేస్తుంది? టాలీవుడ్ లో అభిమాన హీరో ఎవరు? వంటి వివరాలు పెద్దగా ఫోకస్ కాలేదు. తాజాగా ఓ సందర్భంలో టాలీవుడ్ లో తన తొలి ఛాయిస్ ఎవరు? అంటే టక్కున ఎన్టీఆర్ పేరు చెప్పింది. ఎన్టీఆర్ తో కలిసి నటించాలనే కోరిక ఎప్పటి నుంచో ఉంది. అది దేవరతో తీరుతుంది. అలాగే బాలీవుడ్ నుంచి చూస్తే రణబీర్ కపూర్ తో



రొమాన్స్ చేయాలని తెలిపింది. బాలీవుడ్ లో యంగ్ హీరోలంతా ఓ ఎత్తైతే రణబీర్ మాత్రం సమ్ థింగ్ స్పెషల్. అతనితో వీలైనంత త్వరగా సినిమా చేయాలంది. త్వరలోనే ఆ అవకాశం వస్తుందని అంది. ఇంకా హిందీ హృతిక్ రోషన్..టైగర్ ష్రాఫ్.. రణవీర్ సింగ్ లతోనూ కలిసి పనిచేయాలనుందని స్పష్టం చేసింది. ఇక ఎలాంటి దర్శకులతో పనిచేయాలని ఉందంటే? 'నీరజ్ ఘోవాన్..సంజయ్ లీలా భన్సాలీ..కరణ్ జోహార్ లతో పనిచేయాలని ఉంది. వాళ్లతో ఛాన్స్ వస్తే వదులుకోను. ఎంత బిజీగా ఉన్నా డేట్లు అడ్జెస్ట్ చేస్తాను.ఎందుకంటే ఆ ముగ్గురు నా అభిమాన దర్శకులు' అంది. ఇంకా తెలుగులో సూపర్ స్టార్ మహేష్..రౌడీబోయ్ విజయ్ దేవరకొండలతో కూడా సినిమాలు చేయాలని ఉందని గతంలో తెలిపింది. మహేష్ బ్యూటీ గురించి ప్రత్యేకంగా పొగిడేసింది. వయసు ముదిరే కొద్దీ మరింత ప్రకాశవంతంగా మారిపోతున్నారంటూ నవ్వేసింది. జాన్వీ హిందీ సినిమాల లైనప్ చూస్తే రాజ్ కుమార్ రావ్ తో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'లో నటిస్తోంది. 'ఉలాజ్' అనే మరో సినిమా కూడా సెట్స్ లో ఉంది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో రానున్న ఓ సినిమాతో కోలీవుడ్ లో కూడా లాంచ్ అవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

## తమన్నా.. సక్సెస్ లేకున్నా ఆఫర్లే ఆఫర్లు

సౌత్ లో స్టార్ హీరోయిన్ గా సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతోన్న అందాల భామ తమన్నా. ఈ అమ్మడు శ్రీ మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఆ సినిమా సక్సెస్ కాకపోయిన నెక్స్ట్ హ్యాపీడేస్ తో మొదటి విజయం అందుకొని రచ్చ సినిమాతో కమర్షియల్ హీరోయిన్ గా మారిన మిల్కీ బ్యూటీ తరువాత వరుసగా స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వస్తోంది. తెలుగులో ప్రస్తుతం ఉన్న స్టార్స్ అందరితో కూడా ఈ బ్యూటీ ఆడిపాడిందని చెప్పొచ్చు. ఇప్పుడు భోళా శంకర్ సినిమాలో మెగాస్టార్ కి జోడీగా ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. మరో వైపు జైలర్ మూవీలో కూడా కీలక పాత్రలో నటించింది. ఇవి ఇలా ఉండగానే హిందీలో రెండు వెబ్ సిరీస్ లు కంప్లీట్ చేసింది. అలాగే యంగ్ హీరో కొత్త ప్రాజెక్ట్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇలా



చేతినిండా తమన్నాకి అవకాశాలు ఉండటం విశేషం. ఇవిలా ఉండగానే ఇప్పుడు తమిళ్ స్టార్ హీరో అజిత్ కుమార్ కి జోడీగా పాన్ ఇండియా మూవీకి ఒకే చెప్పింది. తాజాగా ఈ సినిమాని అఫీషియల్ ఎనౌన్స్ చేశారు. మగిజ్ తిరుమణి దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కనుంది. త్రిష చిత్రంలో మెయిన్ లీడ్ చేస్తూ ఉండగా సెకండ్ లీడ్ కోసం తమన్నాకి ఎంపిక చేశారు. నిజానికి ఈ ఇద్దరు హీరోయిన్స్ అవుట్ డేటెడ్ అని చెప్పాలి. అయితే త్రిష పొన్నియన్ సెల్వన్ సినిమాతో మళ్ళీ స్పీడ్ పెంచింది. ఏకంగా స్టార్స్ తో అవకాశాలు సొంతం చేసుకుంటుంది. ఇక తమన్నా చేతిలో చెప్పుకోదగ్గ సక్సెస్ అయితే లేదు. కానీ ఇంకా స్టార్ హీరోయిన్ గా తన హవాని కొనసాగిస్తోంది. ఒక్కో సినిమాకి 3 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటుంది. ఆమెతో పాటే కెరియర్ స్టార్ట్ చేసిన కాజల్ అగర్వాల్ కి ఆశించిన స్థాయిలో ఆఫర్స్ రావడం లేదు. కానీ సీనియర్ హీరోలకి జోడీగా తమన్నా ఛాన్స్ లు అందుకుంటుంది. ప్రస్తుతం తమన్నా నుంచి వస్తోన్న భోళా శంకర్, జైలర్ హిట్ పడితే మరో మూడు, నాలు ఏళ్ళు కెరియర్ కి ఎలాంటి ఢోకా లేకుండా సాగిపోతుంది. అన్ని ఇండస్ట్రీలలో కూడా చేయడానికి తమన్నా ఇప్పుడు సిద్ధంగా ఉండటం కూడా ఆమె తన ఛరిష్మా ఇంకా కొనసాగించడానికి కారణం అవుతుందని చెప్పాలి. సినిమాలు తగ్గిన కూడా వెబ్ సిరీస్ లు ఎలాగూ ఉండనే ఉన్నాయి. వాటిపై ఫోకస్ చేసుకొని లీడ్ యాక్టర్ గా తన ఇమేజ్ ని అలాగే కొనసాగించే ఛాన్స్ ఉంది.




## టాలీవుడ్ స్టార్స్.. ఆ 3 నెలల్లో 2 వేల కోట్లు?



టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో రాబోయే రోజుల్లో మన అగ్ర హీరోలు ఫ్యాన్ ఇండియా రేంజ్ లోనే కాకుండా పాన్ వరల్డ్ స్థాయిలో కూడా సినిమాలు చేయబోతున్నట్లు అర్ధమవుతుంది. అయితే ఈ ఏడాది కంటే వచ్చే ఏడాది టాలీవుడ్ మార్కెట్ స్థాయి మరింత ఎక్కువగా పెరగబోతుంది అని చెప్పవచ్చు. రాజమౌళితో సంబంధం లేకుండానే మన ప్రముఖ దర్శకులు అగ్ర హీరోలతో కలిసి మార్కెట్ను రెండువేల కోట్లు దాటిస్తారు అని ఇండస్ట్రీలో ఒక మంచి పాజిటివ్ వైబ్రేషన్స్ అయితే క్రియేట్ అవుతున్నాయి. 2024 సమ్మర్ లోనే అతిపెద్ద భారీ సినిమాలు గ్రాండ్ గా విడుదల కాబోతున్నాయి. ఎక్కువ టైం తీసుకుని మన స్టార్ హీరోలు బిగ్ బడ్జెట్ సినిమాలు చేస్తున్నారు. ఇక ఆలస్యమైనప్పటికీ కూడా కంటెంట్తో మాత్రం బలంగా బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అందుకోవడానికి రెడీ అవుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక కేవలం మూడు నెలల వ్యవధిలోనే 2000 కోట్ల వరకు బిజినెస్ జరిగే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ముందుగా 2024 మార్చి నెలలో రాంచరణ్ తేజ్ గేమ్ ఛేంజర్ సినిమా రాబోతోంది. ఈ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పెషల్ గా చెప్పనవసరం లేదు. దాదాపు 250 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఇక సినిమాకు సంబంధించిన బడ్జెట్ ను బట్టి బిజినెస్ లెక్కలు కూడా గట్టిగానే ఉండబోతున్నాయి. ఇక ఆ తర్వాత ఏప్రిల్ మొదటి వారంలోనే తారక్ దేవర సినిమా రాబోతోంది. ఈ సినిమా కోసం 300 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇక దాని తర్వాత మరో రెండు వారాల గ్యాప్ లోనే పుష్ప సెకండ్ పార్ట్ రాబోతోంది. ఈ సినిమాతో అల్లు అర్జున్ మరో రేంజ్ లో సక్సెస్ అందుకోవాలి అని వెయ్యి కోట్ల మార్కెట్ను అందుకోవాలి అని అనుకుంటున్నారు. ఈ సినిమాపై నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ దాదాపు 300 కోట్ల వరకు ఖర్చు చేయబోతోంది. అలాగే ప్రభాస్ కల్కి సినిమాపై వైజయంతి మూవీస్ 550 కోట్ల వరకు పెట్టుబడి పెడుతోంది. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా వచ్చే అవకాశం ఉంది. ఇంకా మొదటి పార్ట్ తోనే అశ్విని దత్ వెయ్యి కోట్లకు పైగానే బిజినెస్ చేయాలని చూస్తున్నాడు. ఈ లెక్కన చూస్తే చాలా ఈజీ గానే మన స్టార్ హీరోలు కేవలం సమ్మర్ లోనే 2000 కోట్ల నుంచి 2500 కోట్ల రేంజ్ లో బిజినెస్ అయితే చేయవచ్చని తెలుస్తోంది. మరి వీటిలో ఈ సినిమా అత్యధిక స్థాయిలో ప్రాఫిట్స్ అందిస్తుందో చూడాలి.

## ఓ మగాడు ప్రెగ్నెంట్? అయితే.. ?సొహెల్ మిస్టర్ ప్రెగ్నెంట్ ట్రైలర్?




బిగ్‌బాస్ ఫేమ్ సొహెల్ గురించి తెలిసిందే. నటుడిగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. చివరిగా ఆర్గానిక్ మామ.. హైబ్రిడ్ అల్లుడు సినిమాతో వచ్చిన ఆయన.. ఇప్పుడు మిస్టర్ ప్రెగ్నెంట్ అనే ఓ ప్రయోగాత్మక మూవీతో రాబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ పోస్టర్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. తాజాగా మూవీ ట్రైలర్ విడుదలైంది.

ఈ ప్రచార చిత్రాన్ని అక్కినేని నాగార్జున విడుదల చేశారు. ఈ ప్రచార చిత్రం ఆద్యంతం ఫన్ అండ్? ఎమోషన్స్?తో ఆకట్టుకుంటోంది. సరదాగా ఆడుతూ పాడుతూ లైఫ్?ను హ్యాపీగా గడిపే కుర్రాడు... ప్రేమ, పెళ్లి అంతలోనే ఎవరూ ఊహించని ఓ ట్విస్ట్?ను ఎదుర్కొంటాడు. ఓ మగవాడు గర్భం దాలిస్తే.. ఎలా ఉంటుందో అన్న అంశంతో సినిమాను తెరకెక్కించినట్లు చూపించారు. 'నా పేరు గౌతమ్. నాది మంచి క్రేజీ లైఫ్.. ఓ క్రేజీ గర్ల్ ఫ్రెండ్'? అంటూ ప్రారంభమైన ఈ ట్రైలర్?లో... 'ఇది అందరి లైఫ్?లో ఉండేదే బ్రో.. కానీ నా లైఫ్?లో ఓ ట్విస్ట్' అంటూ సొహెల్ అసలు కథలోకి తీసుకెళ్తాడు. ఆ తర్వాత అతడు ప్రెగ్నెంట్ అవడాన్ని చూపించడం, దాంతో అతడు ఎలాంటి అవమానాలను, ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందనేది ప్రచార చిత్రంలో చూపించారు. ఇక ప్రచార చిత్రం చివర్లో.. ఎవ్వరూ ఏం అనుకున్నా తన బేబీ కోసం సొహెల్ కష్టపడటం, బాధపడటం వంటి సీన్లు ఎమోషన్?కు గురి చేశాయి. నీకు ఏం కాదు.. నేనున్నాను అంటూ తన కడుపులో ఉన్న బేబీతో చెప్పే డైలగ్.. మనసులను హత్తుకుంది. మొత్తంగా సోహెల్ యాక్టింగ్ చాలా బాగుంది. ఎమోషన్? సీన్లను బాగానే హ్యాండిల్ చేసినట్లు అర్థమవుతోంది. దర్శకుడు శ్రీనివాస్.. మొదట్లో నవ్విసూనే ఆ తర్వాత సడెన్?గా ఎమోషనల్ వైపు కథను తీసుకెళ్లేలా సీన్లను ప్రజెంట్ చేయడం బాగుంది. ఈ చిత్రానికి అతడు దర్శకత్వంతో పాటు స్క్రీన్?ప్లే కూడా అందించారు. సుహాసిని మణిరత్నం, బ్రహ్మాజీ, రజా రవీంద్ర, అలీ, అభిషేక్ రెడ్డి, వైవా హర్ష, స్వప్నిక తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. మైక్ మూవీస్ బ్యానర్‌పై అప్పి రెడ్డి, రవీరెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి కలిసి సంయుక్తంగా చిత్రాన్ని నిర్మించారు.' శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించారు. ప్రవీణ్ పూడి ఎడిటర్?గా వ్యవహరించగా.. నిజార్ షఫీ సినిమాటోగ్రఫీ అందించారు.

## పాయల్ చేతిలో ఉన్నది అదొక్కటేనా..!

పాయల్ రాజ్ పుత్ లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న సినిమా మంగళవారం. మహాసముద్రం తర్వాత కొద్దిపాటి గ్యాప్ తో అజయ్ భూపతి డైరెక్ట్ చేస్తున్న ఈ మంగళవారం సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆరెక్స్ 100 తో పాయల్ కి ఒక రేంజ్ పాపులారిటీ వచ్చేలా చేసిన అజయ్ భూపతి మరోసారి ఈ సినిమాతో ఆమె గ్రాఫ్ పెంచాలని చూస్తున్నాడు. మంగళవారం సినిమా టీజర్ చూసిన ఎవరైనా సరే పాయల్ కి మళ్లీ మరో అద్భుతమైన పాత్ర దక్కిందని అనుకుంటున్నారు. మొదటి సినిమా ఆరెక్స్ 100 తోనే సూపర్ క్రేజ్ తెచ్చుకున్న పాయల్ ఆ తర్వాత ఆ క్రేజ్ ని నిలబెట్టుకోలేకపోయింది. ఆరెక్స్ లాంటి కథలే వస్తుండటం వల్ల అమ్మడు కాదనేసింది. అయితే వెంకటేష్ లాంటి సీనియర్ హీరోతో ఛాన్స్ వచ్చినా సరే అమ్మడికి లక్ కలిసి రాలేదు. ఇదిలా ఉంటే పాయల్ రాజ్ పుత్ మంగళవారం మీద చాలా హోప్స్



పెట్టుకుంది. సినిమాతో తనలోని మరో యాంగిల్ ని చూపించాలని ఫిక్స్ అయ్యింది అమ్మడు. అజయ్ భూపతి కూడా మహా సముద్రంతో టార్గెట్ మిస్ అవడంతో సినిమా కోసం మరింత కసి తో పనిచేశాడు అజయ్ భూపతి. ఈ సినిమా టీజర్ తోనే ఆసక్తి కలిగించాడు. ఈ సినిమాతో పక్కాగా అజయ్ తను అనుకున్న సక్సెస్ అందుకుంటాడని తెలుస్తుంది. పాయల్ రాజ్ పుత్ కూడా ఆరెక్స్ 100 తర్వాత అరడజను సినిమాలు దాకా చేసింది కానీ ఏ ఒక్కటి అమ్మడికి లక్ కలిసి రాలేదు. ఫైనల్ గా మళ్లీ అజయ్ భూపతితోనే కలిసి హిట్ కొట్టాలని చూస్తున్నాడు. ఈ సినిమా ఆగష్టు 8న రిలీజ్ చేయాలని అనుకున్నా అది వాయిదా పడింది. సినిమా రిలీజ్ ఎప్పుడన్నది తెలియదు కానీ అజయ్ భూపతి మాత్రం ఈ సినిమాపై చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడని తెలుస్తుంది. అజయ్ భూపతి పాయల్ రాజ్ పుత్ డైరెక్టర్ హీరోయిన్ కాంబో లో వస్తున్న మంగళవారం కూడా హిట్ పడితే మాత్రం పాయల్ ని అజయ్ ఇక వదిలి పెట్టకుండా తన ప్రతి సినిమాలో ఆమెను హీరోయిన్ గా తీసుకుంటాడని చెప్పొచ్చు.

ఈ సినిమాలో కమల్ కృష్ణ, అజ్మల్ అమీర్, ప్రియదర్శి నటిస్తున్నారు. సినిమాలో పాయల్ పర్ఫార్మెన్స్ చూసి అందరు సర్ ప్రైజ్ అవుతారని అంటున్నారు. మరి పాయల్ మంగళవారం ఎలా ఉండబోతుంది. పాయల్ చేతిలో ఉన్న ఈ సినిమా ఆమెకు హిట్ అందిస్తుందా లేదా అన్నది చూడాలి.

## కృతి శెట్టి గ్లామర్ ట్రీట్.. మెల్లగా డోస్ పెంచుతోందిగా..

ఉప్పెన సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ కృతి శెట్టి. ఈ బ్యూటీ మొదటి చిత్రంతోనే సూపర్ సక్సెస్ అందుకొని వెనక్కి తిరిగి చూసుకునే ఛాన్స్ లేకుండా వరుస అవకాశాలు అందుకుంది. క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. వరుస హ్యాట్రిక్ హిట్స్ సొంతం చేసుకోవడంతో కుర్ర హీరోలు అందరూ ఈ బ్యూటీ కోసమే పోటీ పడ్డారు. దీంతో రామ్, నితిన్, నాగ చైతన్యకి జోడీగా నటించే ఛాన్స్ వచ్చింది. అయితే ఆమె పాత్ర వరకు బాగానే ఉన్న వరుసగా నాలుగు డిజాస్టర్స్ కృతి శెట్టి ఖాతాలో వచ్చి పడ్డాయి. దీంతో రేస్ లో ఇప్పుడు వెనుకబడిపోయింది. ప్రస్తుతం తెలుగులో ఈ బ్యూటీ చేతిలో ఓక సినిమా మాత్రమే ఉంది. అయితే తమిళంలో సూర్యకి జోడీగా ఓ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మలయాళంలో యంగ్ హీరోతో పాన్ ఇండియా ప్రాజెక్ట్ లో నటిస్తోంది. ఈ చిత్రాలపై కృతిశెట్టి చాలా హోప్స్ పెట్టుకుంది. సినిమా అవకాశాలు తగ్గడంతో ఈ మధ్య ఫోటోషూట్ లతో అమ్మడు స్పీడ్ పెంచుతుంది. గ్యాప్ లేకుండా హాట్ హాట్ అందాలతో తనని తాను షోకేస్ చేసుకుంటుంది.



ఇప్పుడు ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. తాజాగా ఈ చిన్నది. బ్లాక్ కలర్ స్కర్ట్ లో అదిరిపోయే అందాలతో టెంప్టింగ్ ఫోటోలు ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంది. ఈ ఫోటోలకి లక్షల్లో లైక్స్ వస్తున్నాయి. స్కర్ట్ లో థైస్ అందాలతో చూపిస్తూ కవ్వించే సోకులతో కృతి శెట్టి కుర్రాళ్ళకి చెమటలు పట్టిస్తోంది. ఎర్రటి పెదాలతో మత్తెక్కించే చూపులతో మనసు వికలం చేస్తోంది. ముగ్ధమనోహరమైన ఆమె నయనారవిందానికి ఎలాంటి వారైన మంత్రముగ్దులు కావాల్సిందే. సరైన కథలు పడితే మాత్రం కృతి శెట్టి రేంజ్ ని ఎవ్వరూ అందుకోలేరని ఆమె అందాల సిరులని చూస్తూ ఉంటే కచ్చితంగా అనిపిస్తుంది. మరి ఈ సుందరికి సూపర్ సక్సెస్ ఎప్పుడు వస్తోందనేది వేచి చూడాల్సిందే. కథల ఎంపికలో కరెక్ట్ గా ఉంటే కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్స్ పడతాయి. వాటిని కరెక్ట్ గా వినియోగించుకంటే పదేళ్లు హీరోయిన్ గా కెరియర్ కి తిరుగుండదు.



# అర్వింద్ కుసంస్కారి.. రేవంత్ తెలంగాణకు పట్టిన వ్యాధి

నిజామాబాద్: నిజామాబాద్ బీజేపీ ధర్మపురి అర్వింద్ ఒక్క మంచి పనైనా చేశారా? అంటూ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. నిజామాబాద్ పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌లపై ధ్వజమెత్తారు. "నిజామాబాద్ ఎంపీ కుసంస్కారంగా.. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. హిందువులు, ముస్లింలు అంటూ మతాల మధ్య చిచ్చు రేపుతున్నారు. రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా నిజామాబాద్ అభివృద్ధి చెందింది. కొంతమంది ఎలక్షన్ రాగానే మీ ముందుకు వస్తారు.

గతంలో నక్సలిజం, తీవ్రవాదంతో ఆగమైన తెలంగాణ.. ఇప్పుడు నంబర్ వన్ రాష్ట్రంగా అవతరించింది. అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రజలు సంతోషంగా ఉంటే కొందరికి మనసున పడ్తలేదు. కాంగ్రెస్ వాళ్లు ఒక్కసారి అవకాశం ఇవ్వమని అంటున్నారు. 50 ఏళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు? మళ్లీ ఏ ముఖం పెట్టుకుని అడుగుతారు? రేవంత్ రెడ్డి తెలంగాణవాది కాదు.. తెలంగాణకు పట్టిన వ్యాధి. మాది గల్లీ పార్టీ.. వారిది ఢిల్లీ పార్టీ. ఢిల్లీ బానిసలైన కాంగ్రెస్, బీజేపీ వారికి.. తెలంగాణ ఆత్మ గౌరవానికి మధ్య జరుగుతున్న పోరాటం. నిజామాబాద్ నగరంలో అంతర్గత రహదారులకు రూ.60 కోట్లు మంజూరు. వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నుంచి గణేష్ బిగాలను భారీ మెజారిటీతో గెలిపించాలి" అని మంత్రి ప్రజలను కోరారు.

# నిజామాబాద్ ఐటీ టవర్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్



నిజామాబాద్ ఐటీ టవర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. దీనితో పాటు న్యాక్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఐటీ హబ్‌ను పరిశీలించారు. కొత్తగా రిక్రూట్ అయిన ఉద్యోగులతో కాసేపు ముచ్చటించారు. రూ.50 కోట్లతో మొత్తం 49,460 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆకట్టుకునే రీతిలో ఈ ఐటీ టవర్‌ను నిర్మించారు. ప్రభుత్వపరంగా టీఎస్ఐఐసీ ద్వారా మౌలిక వసతులు, అత్యాధునిక సౌకర్యాలను కల్పించింది. ఐటీ సంస్థలను నెలకొల్పబోయే వారంతా ఐటీ శాఖతో ఒప్పందాలను కుదుర్చుకున్నది. ఐటీ కంపెనీల్లో ఉద్యోగ నియామక ప్రక్రియను టాస్క్ ఆధ్వర్యంలో జూలై 21న నిర్వహించింది. వేలాది మంది తరలిరాగా అందులో నైపుణ్యం కలిగిన వారిని ఐటీ కంపెనీలు రిక్రూట్ చేసుకుంటున్నాయి. మొత్తం 49,460 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాన్ని ఆకట్టుకునే రీతిలో చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో కలుపుకొని మూడు అంతస్థులతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఎకరం భూమిలో ఐటీ టవర్‌ను డిజైన్ చేశారు. మిగిలిన 2.5 ఎకరాల భూమిని భవిష్యత్తులో ఐటీ టవర్‌ను విస్తరించాలనుకున్న సమయంలో ఎలాంటి స్థలాల కొరత లేకుండా ఉండేందుకు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నారు.

**నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా న్యాక్ :** నగరంలోని సమీకృత కలెక్టరేట్ భవనం, ఐటీ టవర్‌కు ఆనుకొని నిర్మితమైన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సెంటర్‌కు జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నామకరణం చేశారు. ఇందుకోసం రూ.6.15కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఏసీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్ హైటెక్స్ ప్రాంగణంలో ఉండగా, జగిత్యాల జిల్లాలోనూ ఎన్ఏసీ కేంద్రం ఉన్నది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనూ ఈ ప్రాంత యువతీ, యువకుల మేలు కోసం ఎన్ఏసీని నెలకొల్పారు. ఇందులో అధునాతన సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఐదు స్మార్ట్ క్లాస్ గదులు, మూడు ప్రయోగశాలలు, 1 కంప్యూటర్ ల్యాబ్, 120 మంది అభ్యర్థులకు వసతి, భోజన సౌకర్యానికి వీలుగా వసతి గృహం, 1 కౌన్సిలింగ్ గది, 1 ప్లేస్‌మెంట్ రూమ్, 8 కార్యాలయ గదులను నిర్మించారు. చదువుతో సంబంధం లేకుండా స్వయం ఉపాధిపై ఆసక్తి ఉన్న వారందరికీ ఎన్ఏసీ చుక్కానిగా నిలువనుంది. మేసన్ జనరల్, అసిస్టెంట్ బార్ బెండర్ అండ్ స్టీల్ ఫిక్చర్, షట్టరింగ్ కార్పెంటరీ, కన్‌స్ట్రక్షన్ పెయింటర్ అండ్ డెకొరేటర్, అసిస్టెంట్ టెక్నీషియన్ డ్రై వాల్ అండ్ ఫాల్స్ %--% సీలింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషన్, ప్లంబర్(జనరల్), అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ వర్క్ సూపర్‌వైజర్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డర్, అసిస్టెంట్ స్టోర్ కీపర్ అండ్ స్టోర్ కీపర్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్, టైలరింగ్ వంటి వాటిల్లో శిక్షణ ఇస్తారు. భవన నిర్మాణాన్ని జీ ప్లస్ 2 పద్ధతిలో నిర్మించారు. ప్రతి ఫ్లోర్ 12,519 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండగా మొత్తం 37,557 చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చింది.

# తద్దినాలు, పిండాలు పెట్టడం తెలిసిన పార్టీలు ఆ రెండే



హైదరాబాద్: కాంగ్రెస్, టీడీపీ పార్టీలపై మంత్రి జగదీస్ రెడ్డి విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. తద్దినాలు, పిండాలు పెట్టడం తెలిసిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీనే అంటూ వ్యాఖ్యలు చేశారు. లక్షలాది మంది రైతులను ఇబ్బంది పెట్టిన పార్టీ నుంచి వచ్చిన రేవంత్‌కు అంతకు మించి మాటలు రావన్నారు. రైతులను ఆదుకున్నందుకు రేవంత్ పిండాలు పెడతాడా అని ప్రశ్నించారు. తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నందుకు కేసీఆర్‌కు పిండం పెడతావా అంటూ మండిపడ్డారు. రేవంత్ తెలంగాణ రాష్ట్రానికే తద్దినం పెట్టాలనుకుంటున్నారన్నారు. సోనియా, రాహుల్‌పై అక్రమ కేసులు పెడితే మొదట ఖండించింది కేసీఆర్ కాదా అని మంత్రి ప్రశ్నించారు. రేవంత్ లాంటి సంస్కారహీనున్ని కాంగ్రెస్ అధ్యక్షున్ని చేసిందన్నారు. పైసలతో కొనుక్కున్న పదవితో ఇంత అహంకారమా అని వ్యాఖ్యలు చేశారు. యాభై లక్షలతో దొరికి చంద్రబాబును నాశనం చేశావన్నారు. కరెంట్‌పై మాట్లాడి కాంగ్రెస్‌ను ఖతం చేశావన్నారు. తమకు ఎవరు శాశ్వత శత్రువులు లేరని.. అలాగే శాశ్వత మిత్రులు లేరని స్పష్టం చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలెంతో ఏపీ ప్రజలు అంతే అని చెప్పుకొచ్చారు. రేవంత్ నిఖార్సైన తెలంగాణ వాది అయితే జగన్ తండ్రి ఫోటో పెట్టుకొని ఎందుకు తిరుగుతున్నావని అడిగారు.

గద్దర్ బతికినంత కాలం ఎవరి దుర్మార్గాలపై పోరాటం చేశాడో తెలియదా అని అన్నారు. రేవంత్.. గద్దర్ గురించి మాట్లాడితే ఆయన ఆత్మ క్షోభిస్తుందన్నారు. కేసీఆర్‌తో గద్దర్ కలిసి పనిచేశారు తప్ప ఎవరితో కలవలేదని తెలిపారు. గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళేది తామే అని మంత్రి జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు.

# విమర్శలు చేస్తూనే ఒక్క ఛాన్స్ అంటారా?...



నల్గొండ: తొమ్మిదిన్నరేళ్ళల్లో అన్ని రంగాల్లో అభివృద్ధితో మొదటి స్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్ ది అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్‌పై తీవ్రంగా విమర్శలు చేస్తూ ఒక్క ఛాన్స్ అని అడుగుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఆలస్యం కావడానికి అమరుల ఆత్మార్పణాలకు కారణం కాంగ్రెస్ అని వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి రావాలనే దూరాలోచనతో దోపిడీ చేయాలనే ఉద్దేశ్యంతోనే కేసీఆర్‌పై రేవంత్ శాపాలు పెడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు డైరెక్షన్‌లో నడిచే సిపాయిలు మీరు అంటూ ఎద్దేవా చేశారు. విభజన, నదీ జలాలు సమస్యలు పరిష్కరించాకే తెలంగాణలో ఓట్లు అడగాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పే ధైర్యం లేదని గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# ఓట్ల కోసమే బీసీలకు లక్ష భిక్షమిస్తున్నారు



హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వంపై బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "బీసీల పట్ల సీఎం కేసీఆర్ వివక్ష చూపుతున్నారు. ఓట్ల కోసమే బీసీలకు రూ.లక్ష భిక్షమిస్తున్నారు. కేసీఆర్ బీసీ వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం. కేసీఆర్ వైఖరిపై ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు. గృహలక్ష్మి పథకం అప్లై చేసుకోవడానికి మూడు రోజుల సమయం సరిపోదు. అడిగి మరీ మోదీతో కాంగ్రెస్ తిట్టించుకుంటోంది. మణిపూర్‌లో మూడు తెగల మధ్య ఆదిపత్య పోరు. మణిపూర్ అల్లర్ల మంటల్లో విపక్షాలు చలికాచుకుంటున్నాయి. హైదరాబాద్‌లో డ్యూటీ నుంచి ఇంటికి వెళ్తున్న యువతిని నగ్నంగా చేస్తే పోలీసులు ఏమైపోయారు. కేసీఆర్ తయారు చేసిన తాగుబోతు వెధవ మహిళను వివస్త్రను చేస్తే తెలంగాణ సమాజం తలదించుకుంది. ఘటనకు కేసీఆర్ ప్రవేశ పెట్టిన తాగుబోతు విధానమే కారణం. ఏం మొహం పెట్టుకుని పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెడతారు. రాష్ట్రంలో వీధికో శ్యాంబాబు తయారవుతున్నారు." అని మండిపడ్డారు.




# ఆదివాసీ, గిరిజనులకు మంత్రి హరీష్‌రావు శుభాకాంక్షలు

హైదరాబాద్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ, గిరిజనులకు మంత్రి హరీష్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. జల్.. జంగల్.. జమీన్ కొమురం భీము నినాదాన్ని నిజం చేసింది కేసీఆర్ అని అన్నారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ... "విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలు, మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు, మావ నాటే మావ రాజ్.. మా తాండాలో మా రాజ్యం అనే ఆదివాసీ గిరిజనుల ఆకాంక్షలను నెరవేర్చింది కేసీఆర్ గారు. జల్..జంగల్.. జమీన్ కొమురం భీము నినాదాన్ని నిజం చేసింది కేసీఆర్ గారు. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ, గిరిజనులకు శుభాకాంక్షలు" అంటూ మంత్రి హరీష్‌రావు ట్వీట్ చేశారు.

# మళ్లీ భూముల వేలం.. ఈసారి 3 జిల్లాలతో HMDA జాబితా



హైదరాబాద్: మరోసారి భూముల ఈ-వేలానికి హెచ్ఎండీఏ సిద్ధమైంది. రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో భూముల విక్రయానికి నోటిఫికేషన్ జారీ చేసింది. రంగారెడ్డిలోని బైరాగిగూడ, మంచిరేవుల, కోకాపేట, నల్లగండ్ల, బుద్వేల్, చందానగర్, పీరంచెరువు.. మేడ్చల్ - మల్కాజ్‌గిరిలోని బాచుపల్లి, బౌరంపేట, చెంగిచెర్ల, సూరారం.. సంగారెడ్డిలో వెలిమల, నందిగాయ, అమీన్‌పూర్, పతిఘనపూర్, కిష్టారెడ్డిపేట ప్రాంతాల్లోని భూములను విక్రయించనుంది. చదరపు గజానికి కనీస ధర 12వేలు, గరిష్ఠ ధర 65వేలుగా నిర్ణయించారు. ప్లాట్ల విస్తీర్ణం 302 చదరపు గజాల నుంచి 8,591 చదరపు గజాల వరకు ఉన్నాయి. రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఆగస్టు 16 కాగా.. 18 నుంచి ఈవేలం నిర్వహించనున్నారు. పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్ https://www.hmda.gov.in/auctions/లో చూడొచ్చు.

# అసత్య ప్రచారాలు నమ్మొద్దు.. గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ : మంత్రి వేముల



గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. దరఖాస్తుల విషయంలో ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు అసత్య ప్రచారం చేస్తున్నాయని.. వాటిని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ఖాళీ స్థలం ఉన్న ఎవరైనా సరే గృహలక్ష్మి కింద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు తమ ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు పంపించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం మొదటి దశలో ప్రతి నియోజకవర్గానికి మూడు వేల ఇండ్లు పూర్తయితే.. రెండో దశలో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇల్లు లేని పేదలు ఆందోళన చెందవద్దని.. దశలవారీగా ఇంటి నిర్మాణాల కోసమే ఈ పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 20వ తేదీలోగా గృహలక్ష్మి పథకం మొదటిదశ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తిచేసి లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. 10వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులకు మొదటి విడతలో అవకాశం కల్పిస్తారు. పదో తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులను రెండోవిడతలో పరిశీలించాలని నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపికచేస్తారు. జిల్లా మంత్రి ఆమోదంతో లబ్ధిదారుల జాబితాను సిద్ధంచేస్తారు. కొన్ని జిల్లాల్లో 15వ తేదీలోగా దరఖాస్తుల ప్రక్రియ పూర్తిచేసి లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతుండగా, ఇందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**అర్హతలు, మార్గదర్శకాలు :** మహిళల పేరిటే గృహలక్ష్మి పథకం మంజూరవుతుంది. దరఖాస్తుదారులు తప్పనిసరిగా మహిళ అయి ఉండాలి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా స్థానికులై ఉండాలి. ఆధార్ లేదా ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉండాలి. ఇంటి నిర్మాణానికి ఖాళీ స్థలం ఉండాలి. లబ్ధిదారుడు లేదా ఆ కుటుంబసభ్యుల పేరిట ఆహార భద్రత కార్డు ఉండాలి. దరఖాస్తుదారుడు దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలి. బ్యాంకులో ప్రత్యేక ఖాతా తెరవాలి. తప్పనిసరిగా ప్రభుత్వ బ్యాంకు ఖాతానే ఉండాలి. జన్‌ధన్ ఖాతాను ఎట్టిపరిస్థితుల్లో ఉపయోగించరాదు. ఇప్పటికే ఆర్సీసీ చెత్తుతో ఇల్లు ఉన్నా,జీవో 59కింద లబ్ధిపొందినా ఈ పథకం వర్తించదు.



# ఎయిర్‌పోర్టులో హై అలర్ట్.. ప్రయాణికులు ఈ విషయాన్ని తెలుసుకోండి..

హైదరాబాద్ : ఆగస్టు 15 పంద్రాగస్టు పురస్కరించుకొని అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో హై అలర్ట్ ప్రకటించారు. శంషాబాద్ విమానాశ్రయంలోని ప్రధాన రహదారిలో సీఐఎస్ఎఫ్, రక్ష, పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

ఆగస్టు 15 వరకూ విమానాశ్రయంలోకి సందర్శకులు ఎవరికి ఎంట్రీ లేదని ప్రకటించారు. ప్రయాణికులు,వారితో వెళ్లేవారికి అధికారులు కొన్ని సూచనలు చేశారు. అన్ని రకాల పాసులను ఆగస్టు 16 వరకూ బలగాలు రద్దు చేశాయి. విమానాశ్రయంలోని పార్కింగ్, డిపార్చర్, అరైవెల్ లో సీఐఎస్ఎఫ్ పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నారు. విదేశాలకు వెళుతున్న ప్రయాణికులకు వీడ్కోలు తెలపడానికి ఒకరు లేదా ఇద్దరు రావాలి తప్ప అధిక సంఖ్యలో వస్తే అనుమతించబోమని అధికారులు అంటున్నారు. ఉన్నత చదువు కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల రాకతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. ఒక్కరిని పంపించడానికి తల్లిదండ్రులతో పాటు బంధువులు కూడా పెద్ద ఎత్తున వస్తున్నారు. ఇక ఈ 15 రోజులు రావద్దంటూ కేంద్ర బలగాలు అలర్ట్ చేస్తున్నాయి.

# కేసీఆర్ గురించి గద్దర్ చెప్పిన విషయాన్ని బయటపెట్టిన జూపల్లి



కొల్లాపూర్, నాగర్ కర్నూల్ జిల్లా: గద్దర్‌తో తాను కలిసినప్పుడు సీఎం కేసీఆర్ రెండు సంవత్సరాలపాటు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని గద్దర్ చెప్పాడని కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఉద్యమానికి ఉపిరి యుద్ధ నౌక గద్దర్ మరణం చాలా బాధాకరమని జూపల్లి అన్నారు. "గద్దర్ పాటతోనే నా పాదయాత్ర ప్రారంభం అయ్యేది. ప్రభుత్య లాంఛనలతో దహన సంస్కరణ చేయడం సంతోషం. కానీ బ్రతికినప్పుడు గౌరవం ఇవ్వలేదు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు రూ.5 లక్షలు పోయి 3 లక్షలు చేశారు. పేదవారికి 75 గజాలు, మీ ఫామ్ హౌస్‌కు వంద ఎకరాలా. ప్రజలను అప్పులపాలు చేయడానికే ప్రభుత్య స్కీములు. తెలంగాణ రాష్ట్రాన్ని తాగుబోతుల రాష్ట్రంగా మార్చారు. ఎన్నికలు మూడు మాసాలే, ప్రజావాణి మోసం చేయడానికే కొత్త కొత్త స్కీములు. ఆట మొదలైంది. బి.ఆర్.యస్ పార్టీ భారతం పట్టే సమయం ఆసన్నమైంది. కేసీఆర్ ధైర్యం డబ్బు, ఓటర్లను, నాయకులను, కార్యకర్తలను కొట్టామని ధీమా. బి.ఆర్.యస్ నాయకులకు ఓటు అడిగే హక్కు లేదు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి బహుమతి ఇస్తాం. ప్రజలు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకోవాలి. గృహలక్ష్మి పథకం గడువు 15 రోజులు పెంచాలి. రూ. 3 లక్షలు కాదు. రూ. 5 లక్షలు ఇవ్వాలి." అని ప్రభుత్వాన్ని జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com